


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 82, పేజీలు - 08

మంగళవారం, ఆగష్టు 26, 2025 వెల: 5 రూ/.






## క్యాన్సర్ మందులపై జీఎస్టీ తగ్గింపు

**- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన ఐఎంఏ**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) క్యాన్సర్ సహా పలు అత్యవసర మందులపై జీఎస్టీని తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్వాగతించింది. ఇది ప్రశంసించదగ్గ చర్య అని, దీనివల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది రోగులకు వైద్యం మరింత అందుబాటు ధరల్లోకి వస్తుందని ఒక ప్రకటనలో

2లో..

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

**- ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ ముఖ్యమైన అప్‌డేట్ ఇచ్చింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయని తెలిపింది. రానున్న 48 గంటల్లో ఇది అల్పపీడనంగా మారే అవకాశం

2లో..

## వైద్య రంగంలో కీలక ముందడుగు

**- యాంటీబయాటిక్ నిరోధకతను గుర్తించే మైక్రోఫ్లూయిడిక్ పరికరం**



చెన్నై (ప్రశ్న న్యూస్) వైద్య రంగంలో రోగ నిర్ధారణను వేగవంతం చేసే దిశగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), మద్రాస్ పరిశోధకులు ఒక కీలక ముందడుగు వేశారు. బ్యాక్టీరియాపై యాంటీబయాటిక్స్ పనిచేస్తున్నాయో లేదో (యాంటీబయాటిక్ నిరోధకత) కేవలం 3 గంటల్లోనే గుర్తించగల ఒక వినూత్నమైన, చౌకైన పరికరాన్ని అభివృద్ధి

2లో..





# ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు

**- ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో వర్సిటీని డెవలప్ చేస్తామని హామీ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిపై పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రూ.1000 కోట్లు కావాలన్నా ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఓయూను స్థాయిని స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ కోసం ఏడాదికి రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నేటి ఉదయం ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో కొత్తగా నిర్మించిన దుందుభి, బీమా హాస్టల్ భవనాలను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అక్కడే డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఉస్మానియా

2లో..

## గాజాలో హాస్పిటల్‌ను పేల్చేసిన ఇజ్రాయిల్



**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** గాజా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇజ్రాయెల్ భీకర దాడులను ఉద్ధృతం చేసింది. తాజాగా గాజాలోని ఆస్పత్రిపై భారీ వైమానిక దాడి చేపట్టింది. ఈ దాడిలో నలుగురు జర్నలిస్టులతో పాటు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వివరాలను గాజాలోని హెల్త్ మినిస్ట్రీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఓ వైపు కాల్పుల విరమణకు చర్చలు జరుగుతుండగానే..

2లో..




## ప్రధాని విద్యార్హతలపై
# కీలక తీర్పు

**- ప్రధాని మోదీ విద్యార్హతలపై కొనసాగుతోన్న వివాదం**
**- చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఉత్తర్వులను రద్దుచేసిన కోర్టు**
**- ఢిల్లీ విశ్వవిద్యాలయానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. మోదీ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయడం కుదరదని తేల్చిచెప్పింది. ఈ క్రమంలో ప్రధాన సమాచార కమిషన్ (సీఐఎస్) ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దాఖలైన దరఖాస్తుకు ప్రతిస్పందనగా

2లో..

## ఉచిత బస్సులకు
# త్వరలో లైవ్ ట్రాకింగ్

**ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

- బస్సులకు ముందు, వెనుక వైపులా బోర్డులు పెట్టాలని సీఎం ఆదేశం
- పథకం విజయవంతం చేసిన మహిళలకు చంద్రబాబు ధన్యవాదాలు
- ఆర్టీసీలో 100 శాతానికి చేరిన ఆక్యుపెన్సీ రేషియో
- మహిళా ప్రయాణికుల శాతం 40 నుంచి 65 శాతానికి పెరుగుదల



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మరో కీలకమైన సాంకేతిక హంగు చేరనుంది. ఇకపై మహిళలు బస్టాపుల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, తమ స్మార్ట్‌ఫోన్లలోనే బస్సు ఎక్కడుందో తెలుసుకునేలా 'లైవ్ ట్రాకింగ్' వ్యవస్థను

2లో..

# లోకల్ పోరు.. తప్పని తిప్పలు

**- సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్న లోకల్ పోరు- లోకల్ బాడీ ఎన్నికల కోసం వ్యూహాలు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సర్పంచ్ ఎన్నికల కోసం కొన్ని రోజుల్లోనే నగారా మోగనుంది. దాంతో చాలా గ్రామాల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. ఎలాగైనా గెలిచి తీరాలని చూస్తున్నారు. అందుకోసం వ్యూహాలు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు ఏ మాత్రం తీసిపోకుండా లోకల్ బాడీ ఎలక్షన్స్ నడవనున్నాయి. దేనికైనా సిద్ధమే, అల్టీమేట్ గా సర్పంచ్ సాబ్ అనిపించుకోవాలి, ఇప్పుడు ఇదే గ్రామాల్లో చర్చ నడుస్తుంది. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది సిద్ధం అవుతున్నారు. పార్టీ అభ్యర్థి అయితే ఒకలా లేదంటే మరోలా పోటీకి రెడీ అవుతున్నారు. ఎవరికి వారు పోటీలో ఉండనున్నారు. గ్రామాల్లో ఉండేవారికి పోటీగా రాజకీయ నేతలు, వ్యాపార వేత్తలు, పార్టీల అభ్యర్థుల ఇలా లిస్టు చాలానే ఉంది. దాంతో ఈసారి సర్పంచ్ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారబోతున్నాయి. ఓటుకు నోటు అనే కాన్సెప్ట్ ను ఇప్పుడు

2లో..

## ప్రోత్సహించండి...
# స్ఫూర్తినింపండి

- గురుకుల విద్యార్థులను అభినందించిన సీఎం చంద్రబాబు
- ఐఐటీ, నిట్, నీట్ లలో విజేతలుగా నిలిచిన 55 మంది విద్యార్థులు
- సచివాలయంలో సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన విద్యార్థులు
- పేదరికం నుంచి వచ్చి ప్రతిభ చూపారంటూ సీఎం ప్రశంస



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారు. ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్ సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని ఈ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన సీఎం, వారి విజయాలను కొనియాడారు. పేదరికాన్ని జయించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు.

3లో..

## తెలంగాణ రాజకీయాల్లో యూరియా వార్

**- రైతులను ముంచుతుంది ఎవరు..?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో వరిపైరు ఏపుగా ఎదిగింది. పంట చేలు పచ్చని చీరకట్టినట్టుగా కళకళలాడుతున్నాయి. ఇప్పుడు పంటకు యూరియా చల్లడంతో మంచి దిగుబడి రావడంతోపాటు రైతన్నకు కాస్త లాభాల పంట పండుతుంది. కానీ ఇదే సమయంలో తెలంగాణవ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా వెంటాడుతోంది. యూరియా విక్రయ కేంద్రాల వద్ద గంటల తరబడి భారీ

2లో..

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేసీఆర్ మద్దతు ఎవరికీ.?

**- కీలక నిర్ణయం దిశగా బీఆర్ఎస్ చీఫ్**

2లో..



## ఉద్రిక్తతల మధ్య భారత్ మానవత్వం

**- పాకిస్థాన్ కు కీలక హెచ్చరిక**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారత ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించింది. జమ్మూలోని తావి నదికి భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌ను అప్రమత్తం చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు అత్యంత క్లిష్టంగా ఉన్న తరుణంలో, దౌత్య మార్గాల ద్వారా ఈ సమాచారాన్ని అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ మీడియా వర్గాల కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లోని భారత

2లో..

## ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు
# అందించడమే లక్ష్యం

**- లాప్రోస్కోపీ యూనిట్ ప్రారంభోత్సవంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్గొండ (ప్రశ్న న్యూస్) నల్గొండ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో కొత్త అధ్యాయాన్ని రాసే విధంగా ఆధునిక లాప్రోస్కోపీ యూనిట్ ప్రారంభమైంది. ఈ యూనిట్‌ను కోమటిరెడ్డి

3లో..

## రాముడిని అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటే

***కాంగ్రెస్ పై బండి సంజయ్ మండిపాటు***



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీకి శ్రీరాముడి పట్ల ఏమాత్రం గౌరవం లేదని, ఆ పార్టీ మొదటి నుంచి రాముడిని అవమానిస్తూనే వస్తోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాముడి విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. గతంలో రామ సేతు వివాదంలో 'రాముడు లేదు, రామాయణం లేదు' అంటూ సుప్రీం కోర్టులో

2లో..

## క్యాన్సర్ మందులపై జీఎస్టీ తగ్గింపు

పేర్కొంది. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పోరాడుతున్న వారికి అండగా నిలవాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ నిర్ణయం అద్దం పడుతోందని ఐఎంఏ తెలిపింది. పన్నుల సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం పలు రకాల అత్యవసర, ప్రాణరక్షక మందులపై జీఎస్టీని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా క్యాన్సర్ చికిత్సలో వాడే మందులతో పాటు ఇతర కీలక ఔషధాలపై పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి, కొన్నింటిపై పూర్తిగా సున్నా శాతానికి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. ఇప్పటికే అధిక ఖర్చుతో రోగులు, వారి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్న చికిత్సలను మరింత అందుబాటులోకి తేవడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశం. అరుదైన వ్యాధుల చికిత్సకు వినియోగించే మందులకు కూడా జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసిస్తూనే, రోగులపై భారాన్ని మరింత తగ్గించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ఐఎంఏ కోరింది. ముఖ్యంగా కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, డయాబెటిస్‌కు వాడే ఇన్సులిన్, బీపీ, గుండె జబ్బుల మందులు, కిడ్నీ వ్యాధులు, ఆస్తమా వంటి దీర్ఘకాలిక సమస్యలకు వాడే ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేసింది. వీటితో పాటు వైద్య పరికరాలపై జీఎస్టీని తగ్గిస్తే ఆసుపత్రులు, క్లినిక్‌ల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని, తద్వారా చికిత్స వ్యయం కూడా తగ్గుతుందని ఐఎంఏ అభిప్రాయపడింది. ఆసుపత్రిలో చేరడం మరింత చౌకగా మారేందుకు హాస్పిటల్ బెడ్లపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని గట్టిగా సిఫార్సు చేసింది. అలాగే, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు ఇస్తే, అత్యవసర సమయాల్లో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని, ఎక్కువ మంది బీమా తీసుకునేందుకు ప్రోత్సాహం లభిస్తుందని వివరించింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

ఉందని, దీని ప్రభావంతో ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ వివరాలను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సోమవారం వెల్లడించారు. ప్రస్తుతం ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం చురుకుగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య ఇది విస్తరించి ఉందని వివరించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుందని స్పష్టం చేశారు.ఈ వాతావరణ మార్పుల వల్ల మంగళవారం ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, కోస్తాంధ్రలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల వారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## వైద్య రంగంలో కీలక ముందడుగు

చేశారు. ఈ ఆవిష్కరణ ద్వారా సరైన సమయంలో రోగులకు సరైన చికిత్స అందించడం సులభతరం కానుంది. ప్రస్తుతం ప్రపంచ ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో యాంటీబయాటిక్ నిరోధకత (ఏఎంఆర్) ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సైతం దీనిని ప్రపంచంలోని టాప్ 10 ఆరోగ్య ముప్పులలో ఒకటిగా పేర్కొంది. సాధారణంగా, ఒక ఇన్ఫెక్షన్‌కు ఏ యాంటీబయాటిక్ సరైనదో తెలుసుకోవడానికి చేసే యాంటీబయాటిక్ ససెప్టిబిలిటీ టెస్టింగ్ (ఏఎస్టీ)కి 48 నుంచి 72 గంటల సమయం పడుతుంది. ఈ జాప్యం వల్ల వైద్యులు కొన్నిసార్లు విస్తృత శ్రేణి యాంటీబయాటిక్స్‌ను వాడాల్సి వస్తుంది. ఇది ఏఎంఆర్ సమస్యను మరింత పెంచుతోంది. దీనిని అధిగమించేందుకే ఐఐటీ మద్రాస్ బృందం ఒక పరికరాన్ని రూపొందించింది. 'ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ' అనే సాంకేతికత ఆధారంగా ఈ పరికరం పనిచేస్తుంది. ఖరీదైన లోహాలకు బదులుగా, స్క్రీన్-ప్రింటెడ్ కార్బన్ ఎలక్ట్రోడ్‌లతో కూడిన మైక్రోఫ్లూయిడిక్ చిప్‌పై ఇది పనిచేస్తుందని ఐఐటీ మద్రాస్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్. పుష్పవనం తెలిపారు. ఈ విధానం వల్ల పరికరం తయారీ ఖర్చు గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రత్యేక నైపుణ్యం లేని సిబ్బంది కూడా దీనిని సులభంగా ఉపయోగించవచ్చని ఆయన వివరించారు. ఈ పరికరం వేగంగా ఫలితాలు ఇవ్వడంతో పాటు, తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావడంతో చిన్న క్లినిక్‌లు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సైతం వినియోగించడానికి అనువుగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందని, సరైన సమయంలో సరైన యాంటీబయాటిక్స్‌ను సూచించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని వారు పేర్కొన్నారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రతిష్ఠాత్మక 'నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం ఐఐటీఎం ఇన్‌స్టిట్యూట్ హాస్పిటల్‌తో కలిసి క్లినికల్ వాలిడేషన్ చేస్తున్నామని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత తమ స్టార్టప్ 'కాపాన్ అనలిటిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' ద్వారా దీనిని వాణిజ్యపరంగా మార్కెట్లోకి తీసుకురావాలని ప్రొఫెసర్ పుష్పవనం వెల్లడించారు.

## ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు

యూనివర్సిటీ లేకపోతే తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదు. ఈ యూనివర్సిటీ తెలంగాణ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఇంజనీర్స్ కమిటీని ఏర్పాటు చేసి అంచనాలు తీసుకురమ్మని ఆదేశించాను. మీ అవసరాలు ఏవైనా ఉంటే చెప్పండి, మేము నిధులు మంజూరు చేస్తాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

### నిరసనలు చేయనివ్వండి - పోలీసులెవ్వరూ కనిపించొద్దు

యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళనల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నేను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీకి వస్తాను. ఆర్ట్స్ కాలేజీ వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నేరుగా నిధులు కేటాయిస్తానని భరోసా ఇచ్చారు. ఆరోజు నిరసనలు తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి. ఆ రోజు యూనివర్సిటీలో ఒక్క పోలీస్ కూడా కనిపించకూడదని డీజీపీని ఆదేశిస్తున్నాను. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే ధైర్యం నాకుంది. కొంతమంది రాజకీయ నాయకులు పదవులు పోయాయని బాధపడుతున్నారు. తమ కొడుకులను ప్రోత్సహించలేకపోయారని ఆవేదన చెందుతున్నారు. కానీ వారి ఉచ్చులో మీరు పడొద్దు. సమస్య ఉంటే మాకు చెప్పండి, మా మంత్రులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఉస్మానియా యూనివర్సిటీ గ్రూప్ 1, 2 లాంటి ఉద్యోగాలు తెచ్చుకోవడానికి కాదు తెలంగాణ సమాజాన్ని పునర్ నిర్మించడానికి అవసరమైన మేథా సంపత్తిని ఆశిద్దామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అయి జిల్లా ఉన్నతాధికారులుగా పరిపాలన సాగిస్తున్నాం. 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు ఓటు హక్కు వయసును తగ్గించుకున్నాం. 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అవుతుంటే అదే వయసులో ఎమ్మెల్యేగా పోటీ చట్టసభల్లోకి ప్రవేశించి ప్రజా సేవ ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు.

### అబద్ధాల ప్రచారాలకు లోను కాకండి

కోదండరాం పై గతంలో జరిగిన కుట్రలను ప్రస్తావిస్తూ, "కోదండరాం సార్‌ను సుప్రీం కోర్టు వరకు లాగి పదవి నుంచి తొలగించారు. ఇదేంటి పైశాచిక ఆనందం? మేము మళ్లీ ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తాం" అని ప్రకటించారు. ప్రభుత్వంపై సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా తప్పుడు ప్రచారం జరుగుతోందని సీఎం ఆరోపించారు. "ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో సింహాలు, ఏనుగులు ఉన్నాయని సెంట్రల్ యూనివర్సిటీ దగ్గర అడ్డుకున్నారు. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేవు. కానీ మానవ రూపంలో ఉన్న మృగాలు మాత్రం ఉన్నాయి. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు. వాళ్లు తిరిగి వస్తే ఉస్మానియా యూనివర్సిటీని కూడా ఉండనివ్వరు," అని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

### యూనివర్సిటీ అభివృద్ధి బాధ్యత నాది

"మీ చదువుకు ఏం కావాలో అడగండి. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి చేయడం నా బాధ్యత. తెలంగాణ సమాజం బాగు కోరని అబద్ధాల సంఘం మాటలను నమ్మొద్దు," అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రెండో సీఎంగా బాధ్యతలు చేపట్టిన నేను పొట్టి శ్రీరాములు పేరును మార్చి రజాకర్లపై పోరాడిన, పాత్రికేయుడిగా రాణించిన సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టుకున్నాం. వాళ్లు మన స్ఫూర్తి ప్రధాతలు. ఐఐఎఫ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం. కోటి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి వారి పోరాటాన్ని గుర్తించుకున్నాం. కానీ సిద్ధాంతాలు నచ్చక కొందరు మనల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. చిన్న కాలేజీలు, డిగ్రీ కాలేజీల విద్యార్థులను గంజాయికి అలవాటు చేసి ప్రశ్నించాల్సిన యువతను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరిగింది. ఒకనాడు దేశంలో, తెలంగాణ సమాజంలో ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ల్యాండ్ చట్టాలతో దళితులు, గిరిజనులు, పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చారు. ఆనాడు భూమి ఉంటే గౌరవం అని ఇందిరమ్మ పోరుతో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పట్టాలిచ్చాయి. పోడు భూముల పట్టాలు, 25 లక్షల భూములు దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు పట్టాలుగా అందాయి. చదువు, చైతన్యం ఉంటేనే రాణిస్తారు. నా వద్ద పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు. నేను ఇవ్వగలిగింది నాణ్యమైన విద్య ఒక్కటే.

### పంచడానికి భూములు లేవు..

రాష్ట్రంలో భూములు లేవు. పంపకాలు జరిగాయి. 1.50 కోట్ల ఎకరాలు సాగవుతుంటే 96 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ఒకట్రెండు ఎకరాలు ఉన్నవారే. అందుకే మీరు ధనవంతులు కావాలంటే మేం నాణ్యమైన విద్యను అందిస్తాం. విద్యా ప్రమాణాలు పెంచాలంటే ఏం చేయాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మీ విలువైన సలహాలు, సూచనలు యూనివర్సిటీ ద్వారా ఇవ్వాలని' సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## గాజాలో హాస్పిటల్‌ను పేల్చేసిన ఇజ్రాయిల్

ఇంకోవైపు గాజాలో వైమానిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మరోవైపు గత వారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయెల్ సైన్యం తొలి అడుగులు వేసినట్లు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ వైమానిక దాడులతో గాజా ప్రాంతం అట్టుడుకిపోతోంది. తాజాగా దక్షిణ గాజాలోని నసేర్ ప్రాంతంలోని ఓ ఆస్పత్రి భవనంపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు జరిపింది. ఈ దాడుల్లో నలుగురు జర్నలిస్టులతోపాటు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు దక్షిణ గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి సముదాయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. మృతుల్లో అల్ జజీరా, రాయిటర్స్ కు చెందిన జర్నలిస్టులు ఉన్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొంది. ఇక తాజా దాడిలో ఆస్పత్రి భవనం వద్ద పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.ఇజ్రాయెల్ సైన్యం గత 22 నెలలుగా నసేర్ ఆస్పత్రిపై దాడులు చేస్తూనే ఉంది. ఈ ఆస్పత్రిలో హమాస్ మిలిటెంట్స్ ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తాము హమాస్ ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. నసేర్ ఆస్పత్రిలో హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వాదిస్తోంది. వాటినే తాము టార్గెట్ చేసినట్లు స్పష్టం చేసింది. జూన్ లోనూ ఇదే ఆస్పత్రిపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ముగ్గురు మృతి చెందగా 10 మందికిపైగా గాయపడ్డారు.ఇక గాజా ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయెల్- పాలస్తీనా యుద్ధం మొదలైనప్పటి నుంచి 62, 686 మంది పాలస్తీనియులు మృతి చెందారు. వీరిలో సగానికి పైగా మహిళలు, చిన్నారులే ఉన్నారు. అయితే ఈ వివరాలను ఇజ్రాయెల్ కొట్టిపారేసింది. ఇక ఇజ్రాయెల్ సైన్యం గాజాను స్వాధీనం చేసుకోవడాన్ని అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ నిర్ణయాన్ని తాము అంగీకరించబోమని ఫ్రాన్స్, బ్రిటన్ సహా పలు దేశాలు తీర్మానించాయి. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామంటూ ప్రకటన చేశాయి. మరోవైపు ఐక్యరాజ్యసమితి కూడా ఇజ్రాయెల్ నిర్ణయాన్ని తప్పుపట్టింది.

## రాముడిని అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటే

అఫిడవిట్ దాఖలు చేసిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. దశాబ్దాల పాటు అయోధ్యలోని రామ మందిరం తలుపులు తెరుచుకోకుండా అడ్డుపడిందని ఆరోపించారు. అంతేకాకుండా, రాహుల్ గాంధీ గతంలో 'రామ మందిర ఉద్యమం విఫలమైంది' అని వ్యాఖ్యానించారని, ఇటీవల జరిగిన ప్రాణ ప్రతిష్ఠ వేడుకను సైతం కాంగ్రెస్ బహిష్కరించిందని మండిపడ్డారు. హిందువులను 'హింసాత్మకులు'గా అభివర్ణించింది కూడా కాంగ్రెస్ పార్టీయేనని ఆయన అన్నారు. రాముడి పేరును స్మరిస్తున్న బీజేపీని ఎగతాళి చేయడం వారి వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "కాంగ్రెస్‌కు రాముడిని అవమానించడం ఒక అలవాటుగా మారింది. కానీ మాకు రాముడు అంటే ప్రాణం, విశ్వాసం. శ్రీరాముడు మాకు రాజకీయ అంశం కాదు, ఈ దేశపు గుండె చప్పుడు" అని బండి సంజయ్ స్పష్టం చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ వంటి చారిత్రక ఘట్టాల్లో కాంగ్రెస్ వ్యవహరించిన తీరును ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని ఆయన తెలిపారు. తాము రాముడి భక్తిని ఎన్నటికీ రాజకీయాలకు వాడుకోమని చెప్పారు.

## తెలంగాణ రాజకీయాల్లో యూరియా వార్

క్యూలైన్లో నిలబడ్డా, రోజుల తరబడి కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితంలేదు. యూరియా ఇచ్చి మా పంటను బతికించండీ మహాప్రభో అంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ పాపం కేంద్రం వల్లనే అంటూ బిజెపిని విమర్శిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే రైతులకు యూరియా కొరత కష్టాలంటూ ఆరోపిస్తున్నాయి బీజేపీ బీఆర్ఎస్. ఇలా ఒకరిపై ఒకరు తప్పు మాది కాదంటే ,మాది క్షాదంటూ యూరియా రాజకీయాలు చేస్తున్నారు. తెలంగాణలో యూరియా కొరత మరికొద్ది రోజులు కొనసాగితే ,ఏపుగా ఎదిగిన వరిపైరు సత్తువ లేక నిస్సారంగా మారిపోతుంది. దిగుబడి ఊహించని స్థాయిలో పడిపోతుంది. రైతుల జీవితాలు తలకిందులవుతాయి. ఈ ప్రభావం కేవలం రైతులపై మాత్రమే కాదు, దిగుబడి భారీగా తగ్గితే బియ్యం ధరలు అమాంతం పెరగడంతోపాటు ధాన్యం కొరత పెరిగి తీవ్ర ఆహార సంక్షోభం నెలకొంటుంది. అందుకే తెలంగాణ వ్యాప్తంగా వరి పంటకు ప్రాణవాయువైన యూరియా కోసం రైతులు భారీగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. చెప్పులు, పాస్ బుక్‌లు క్యూలైన్లలో పెట్టి గంటల తరబడి యూరియా కోసం విక్రయ కేంద్రాలవద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ సీజన్‌లో 70వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించింది, కానీ ఇందులో 44,500 టన్నులు మాత్రమే రైతులకు ఇప్పటి వరకూ సరఫరా చేశారు. మిగతా 25,500 మెట్రిక్ టన్నులా యూరియా సరఫరా కాకపోవడంతో క్షేత్రస్థాయిలో కొరత ఏర్పడింది. యూరియా రాగానే సహకార సంఘాల వద్ద, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియాను వెంట వెంటనే రైతులు కొనుగోలు చేస్తుండం, క్షణాల్లో వచ్చిన స్టాక్ వచ్చినట్లు ఖాళీ అవ్వడంతో ఎక్కువ మంది రైతులకు యూరియా అందడంలేదు.తెలంగాణ వ్యాప్తంగా కొన్ని చోట్ల ఒక ఎకరాకు రెండు బస్తాలు ఇస్తుంటే ,మరికొన్ని చోట్ల ఒక బస్తా ఇస్తున్నారు. ఎక్కువ శాతం రైతులు యూరియా అందక కొనుగోలు కేంద్రాల వద్ద కాళ్ల వాచేలా నిలబడక తప్పడంలేదు. ప్రైవేటు వ్యాపారులు సైతం బ్లాక్‌లో కొని భారీగా స్టాక్ నిలబెట్టుకోవడం, యూరియాకు విపరీతంగా డిమాండ్ పెంచడంపై రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మేడ్చల్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలలో యూరియా కొరత తీవ్రత ఓ రేంజ్‌లో ఉంది. మేడ్చల్ జిల్లాలకు 8వేల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉంది, ఆదిలాబాద్ జిల్లాలో 7వేల మెట్రిక్ టన్నుల యూరియా వెంటాడుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలో 8,300 మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉంది. సంగారెడ్డి 6400 మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడింది. కొరత తారాస్థాయిలో ఉన్న సమయంలో కూడా వచ్చిన ఎరువులు వచ్చినట్లు బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్నాయంటూ రైతులు మండిపడుతున్నారు. దళారులు యూరియా డిమాండ్ విపరీతంగా పెంచేయడంతో పుస్తెలు తాకట్టుపెట్టి మరీ అధిక ధరలకు యూరియా కొనసాల్సిన దుస్థితి రైతులను వెంటాడుతోంది.కేంద్రం నుంచి తెలంగాణకు ఈ ఏడాది రావాల్సిన ఎరువుల కోటాలో ఇంకా 3.12లక్షల మెట్రిక్ టన్నుల రావాల్సి ఉంది ,అందుకే రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందనేది అధికార పార్టీ వాదన. తాజాగా కాంగ్రెస్ ఎంపీల నిరసనలతో 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడున్న డిమాండ్‌కు 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరిపోదు. ఇదిలా ఉంటే అధికార,ప్రతిపక్షాలు ఎవరి లెక్కలు వారు చెబుతున్నారు. యూరియా కొరత సమస్యను రాజకీయ విమర్శలకు ఆయుధంగా మార్చుకుంటున్నారు.తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం కావాలనే తొక్కిపెడుతోందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వమే కావాలని యూరియా కొరత సృష్టించి రాద్ధాంతం చేస్తోందని బిజెపి నేతలంటున్నారు. రాష్ట్రంలో యూరియా కష్టాలకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని బిఆర్ఎస్ అంటోంది. మాకు ఈ 5నెలల్లో ఇవ్వాల్సిన యూరియా కేంద్రం ఇవ్వలేదు, అది మేము తయారు చేసేది కాదు, కేంద్రం సరఫరా చేసినప్పుడే రైతులకు ఇవ్వాలి. ఇదంతా కేంద్రం చేతిలో పని. కొరత ఉంటే చైనా, రష్యా నుంచి దిగుమతి చేసుకోకుండా, ఇక్కడ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేయలేక కేంద్రం చేతులెత్తేయడం వల్లనే రైతులు నష్టపోతున్నారని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తోంది.చైనా ,ఉక్రెయిన్ నుంచి యూరియాను దిగుమతి చేసుకుంటున్నాం కానీ దిగుమతుల్లో కొన్ని ఇబ్బందులున్నాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సబ్సిడీని భరించి రైతులకు యూరియాను అందిస్తున్నది బిజెపి ప్రభుత్వం మాత్రమే అంటున్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. అంతర్జాతీయంగా యూరియా దిగుమతిలో తీవ్ర సమస్యలున్నా సబ్సిడీ భరించి మరీ సరఫరా చేస్తున్నామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వమే చూడాలంటోంది బిజెపి. రాష్ట్ర ప్రభుత్వానికి చేతగాక రైతులు యూరియా కోసం నరకం చూస్తున్నారని బిఆర్ఎస్ అంటోంది. పనిలో పనిగా ఉపరాష్ట్రపతి ఎన్నికలకు, యూరియాకు లింక్ పెట్టింది బీఆర్ఎస్. తెలంగాణలో యూరియా కొరత ఎవరు తీరిస్తే, 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఎవరు సరఫరా చేస్తే, ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికే మా మద్దతని ప్రకటించింది. ఇలా యూరియా కొరత రైతులకు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తుంటే, రాజకీయ పార్టీలకు మాత్రం పదునైన విమర్శనాస్త్రంగా మారింది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేసీఆర్ మద్దత్తు ఎవరికీ.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉపరాష్ట్రపతి ఎన్నిక వేళ తెలంగాణ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్డీఏ - ఇండియా కూటమి నుంచి ఇద్దరు అభ్యర్థులు ఈ పదవి కోసం పోటీలో ఉన్నారు. ఇండి కూటమి అభ్యర్థిగా తెలంగాణ కు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. తెలుగు వ్యక్తి పోటీలో ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్ కోరారు. అయితే,అన్ని పార్టీల స్టాండ్ పైన క్లారిటీ వచ్చింది. ఇప్పుడు మాజీ సీఎం కేసీఆర్ పార్టీ మద్దతు ఎవరికనేది సస్పెన్స్ గా మారుతోంది.ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్ పోటీ చేస్తున్నారు. ఇండీ కూటమి నుంచి అనూహ్యంగా తెలంగాణకు చెందిన సుప్రీం మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని బరిలోకి దించారు. దీంతో, తెలుగు వ్యక్తం పోటీ చేస్తుండటం తో తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలు మద్దతు ఇవ్వాలని రేవంత్ కోరారు. ఏపీలో టీడీపీ, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉన్నాయి. దీంతో.. ఆ రెండు పార్టీలు ఆ కూటమి అభ్యర్థికే మద్దతు ఇవ్వటం ఖాయం అయింది. అదే సమయంలో వైసీపీ మద్దతు బీజేపీ కోరటం.. మాజీ సీఎం జగన్ అందుకు సానుకూలంగా స్పందించటంతో ఏపీ పార్టీల వైఖరి పైన స్పష్టత వచ్చింది.ఇక, తెలంగాణలో కాంగ్రెస్- బీజేపీ ఓటింగ్ పైన క్లారిటీ ఉంది. మరి బీఆర్ఎస్ ఎవరికి మద్దతు ఇస్తుందనేది తేలాల్సి ఉంది. బీఆర్ఎస్ కు లోక్ సభ లో ప్రాతినిధ్యం లేదు. రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. తమ మద్దతు కోసం ఏ కూటమి సంప్రదించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేసారు. తాము రెండు కూటములకు జవాబు దారీ కాదని పేర్కొన్నారు. రేవంత్ ప్రతిపాదించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వమని తేల్చి చెప్పారు. కాగా, కేసీఆర్ ఈ ఎన్నిక పైన పార్టీ ముఖ్యులతో ఇప్పటికే సంప్రదింపులు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కేంద్రంలోని రెండు కూటముల్లో ఎవరికి మద్దతు ఇచ్చినా భవిష్యత్ లో సమస్యలు వస్తాయనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో.. ఈ ఎన్నికకు బీఆర్ఎస్ దూరంగా ఉండే అవకాశం ఉందని పార్టీ నేతల సమాచారం. వినాయక చవితి తరువాత పార్టీ ముఖ్యుల సమావేశంలో కేసీఆర్ అధికారికంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు

## ప్రధాని విద్యార్హతలపై కీలక తీర్పు

ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతల వివరాలను వెల్లడించాలని ఢిల్లీ యూనివర్సిటీకి ప్రధాన సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం నిలిపివేసింది. ప్రధాని విద్యార్హతలు, డిగ్రీ గురించి వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై ఇరు పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. మోదీ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయడంపై దాదాపు పదేళ్లుగా న్యాయ పోరాటం కొనసాగుతోంది. మోదీ తన ఎన్నికల అఫిడ్‌విట్‌లో 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తిచేసినట్టు చూపించారు. ఈ క్రమంలో ప్రధాని విద్యా రికార్డు కోసం 2016లోహక్కుల కార్యకర్త ఆర్టీఐ ద్వారా వివరాల కోరడంతో వివాదం మొదలైంది. మూడో పక్షానికి సంబంధించిన వివరాలను బయటపెట్టడం నిబంధనలకు విరుద్ధమని ఢిల్లీ విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది. కానీ, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సీఐసీ) ఈ వాదనతో ఏకీభవించలేదు. ఈ క్రమంలో 2016 డిసెంబరులో తనిఖీకి అనుమతించాలని యూనివర్సిటీని ఆదేశించింది. ధేశ ప్రధాని విద్యార్హతలు పారదర్శకంగా ఉండాలని ఇచ్చిన ఉత్తర్వులను సీఐసీ సమర్థించింది. ఈ వివరాలు పొందుపరిచిన రిజిస్టర్‌ను ప్రజాపత్రంగా పరిగణిస్తారని కూడా సమాచార కమిషన్ పేర్కొంది. దీంతో ఢిల్లీ యూనివర్సిటీ ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు.. 2017 జనవరి 23 స్టే విధించింది. తాజాగా, యూనివర్సిటీకి అనుకూలంగా తీర్పు వెలువరించింది. యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. ప్రధాని డిగ్రీ రికార్డులను బహిర్గతం చేయడానికి వర్సిటీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. మోదీ 1978లో బీఏ డిగ్రీ పూర్తిచేశారని వివరించారు.

## లోకల్ పోరు.. తప్పని తిప్పలు

తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో భారీగా అమలు చేయనున్నారు. ఎంత ఖర్చు అయిన పర్వలేదు కానీ, సర్పంచ్ సీట్ లో కూర్చొవాలన్న ప్లాన్స్ తో ముందుకు పోతున్నాయి.గతంలో ఎప్పుడు లేని విధంగా ఈసారి గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నయి. ఎన్నికల షెడ్యూల్ ఇంకా రాలేదు. కానీ, ఓట్ల పండుగ మొదలైంది. అందుకోసం వ్యూహాలు, పేపర్ వర్క్ చేస్తూనే ఉన్నారు. ఎవరిని ఎక్కడ ఎన్నికల కోసం వాడుకోవాలో చూస్తున్నారు. అందుకోసం ప్లాన్ లు సిద్ధం చేసుకుంటున్నారు. ఓట్ల కోసం అంతర్గతంగా చర్చిస్తున్నారు. ఏ కులానికి ఎన్ని ఓట్లు ఉన్నాయి. అందులో తటస్థంగా ఉండేవారు ఎంత మంది. మద్దతు ఇచ్చే వారు ఎంతమంది. డబ్బులకు అమ్ముడుపోయేవారు.. కుల పెద్ద చెబితే వినేవారు.. ఇలా చాలా రకాలుగా ఓటర్లను విభజిస్తున్నారు. 2 వేల లోపు ఓటర్లు ఉన్న గ్రామాల్లో అయితే.. రూ.30 నుంచి 40 లక్షల వరకు ఖర్చు పెట్టాలని చూస్తున్నట్టు సమాచారం. ఇది కొన్ని గ్రామాల్లో అయితే.. ఈ ఖర్చు భారీగా పెరిగే ఛాన్స్ ఉంది.

### స్థానిక పోరుపై యువత గురి

ఏ నోటా విన్నా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల మాటనే. ప్రతి గ్రామంలో ఈ సారి యువకులు పోటీకి దిగుతారని చెబుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని అంటున్నారు. ఈసారి తాము నిలబడి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా చేస్తామని భావిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలోని పలు గ్రామాల్లో యువకులు ప్రచారాన్ని మొదలు పెట్టి రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. పార్టీలకు అతీతంగా పోటీ చేస్తామని, తాము గెలిస్తే గ్రామంలో పలానా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని హామీలిస్తున్నారు. అర్హులైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను సద్వినియోగం అయ్యేలా కృషి చేస్తామని తెలియజేస్తున్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పాలన కొనసాగుతుందని, ప్రజల తరుపున ప్రశ్నించే గొంతుగా ఉంటామని గ్రామల్లో ఇప్పటి నుంచే భరోసా కల్పిస్తున్నారు.

### విందు రాజకీయాలు

ఒక నోట్లు, ముక్క, సుక్కకు తిరుగేలేదు. లోకల్ బాడీ ఎన్నికలు కావడంతో ఆ గ్రామంలో ఉండేవారు ఓటర్లు. ఎవరికి మద్దతు ఇస్తున్నారో, ఎవరు ఎవరి వెంట తిరుగుతున్నారో ఈజీగా తెలుసుకుంటారు. దాంతో తమ వెంట ఉన్న వారికి విందుకు తిరుగులేదు. ఓదార్పు రాజకీయాలు, అప్పటి వరకు ప్రత్యర్థులను బుజ్జగించేందుకు వ్యూహాలు చేస్తున్నారు. ఈసారి పంచాయతీ ఎన్నిలకల్లో చాలా మంది పోటీకి దిగుతారని చెబుతుండడంతో అన్ని పార్టీలలో పెద్ద లీడర్లుగా కొనసాగుతున్న వారు, కొత్తగా పోటీ చేయాలనుకుంటున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. సర్పంచ్ లుగా, ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు.. యువకుల నుంచి పోటీ తప్పదని స్పష్టం కావడంతో రాజకీయాల్లో కొనసాగుతున్న ఆశావహులు గ్రామాల్లో విందు రాజకీయాలు, ఓదార్పు రాజకీయాలను ఇప్పటికే మొదలుపెట్టారు. గ్రామంలో ఎవరైన మరణించినా, శుభకార్యాలు ఉన్న ఇంట్లో వాలిపోయి అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అష్టకష్టాలు పడుతూ వారి మన్ననలు పొందేందుకు కష్టపడుతున్నారు.

### సోషల్ మీడియా ప్రచారం

ఎన్నికల ప్రచారంకోసం ఈసారి ఎక్కువ కష్టపడాల్సిన అవసరమే లేదనిపిస్తుంది. ఈ రోజుల్లో జేబు లో డబ్బులు లేకున్నా ప్రతి ఒక్కరికి మాత్రం ఆడ, మగ తేడా లేకుండా సెల్ ఫోన్ తప్పని సరైంది. దీంతో చాలా మంది సోషల్ మీడియాను ఎక్కువగా వాడుకుంటున్నారు. ప్రతి రోజు ఉద యం నుంచి మొదలు అర్ధరాత్రి వరకు రాజకీయంపై చర్చలు పెడుతూ, గ్రూపు చాటింగ్‌లు చేస్తున్నారు. ఎవరికి నచ్చినట్టు వారు గ్రూపుల్లో మెసేజ్ లు పెడుతున్నారు. వారికి కౌంటర్ ఇస్తూ మరొకరు రిప్లేలుపెడుతున్నారు.అయితేఇప్పుడుమాత్రంప్రచారం సెల్ ఫోన్‌లోనే జరుగుతుందని చెప్పుకోవచ్చు

## ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్

అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలో ఆర్టీసీ పనితీరుపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే, మహిళలు తమ ప్రయాణ సమయాన్ని కచ్చితంగా ప్లాన్ చేసుకోవడానికి వీలు కలుగుతుందని, ఇది వారి సమయాన్ని ఆదా చేయడమే కాకుండా భద్రతను కూడా పెంచుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

### ముందుగా గుంటూరులో పైలట్ ప్రాజెక్ట్

లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించగా, రాబోయే రెండు మూడు రోజుల్లోనే గుంటూరు డిపో పరిధిలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారులు బదులిచ్చారు. అక్కడి ఫలితాలను బట్టి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్త్రీ శక్తి బస్సులకు ఈ సదుపాయాన్ని విస్తరిస్తామని వారు ముఖ్యమంత్రికి వివరించారు. దీనితో పాటు, స్త్రీ శక్తి పథకం కింద నడుస్తున్న 8,458 బస్సులకు స్పష్టంగా కనిపించేలా ముందు, వెనుక భాగాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు సంయమనంతో వ్యవహరించాలని ఆర్టీసీ సిబ్బందికి ఆయన సూచించారు.

### పథకం గ్రాండ్ సక్సెస్.. మహిళలకు సీఎం ధన్యవాదాలు

'స్త్రీ శక్తి' పథకం అమలుపై ముఖ్యమంత్రి ఆరా తీయగా, ఇది అద్భుతమైన విజయం సాధించిందని అధికారులు తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతం మధ్య ఉండేదని, ఇప్పుడు రాష్ట్రంలోని 60 డిపోల పరిధిలో బస్సులు 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని వివరించారు. మహిళా ప్రయాణికుల సంఖ్య 40 శాతం నుంచి ఏకంగా 65 శాతానికి పెరిగిందని గణాంకాలతో సహా తెలిపారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర మహిళలు ఎంతో చైతన్యవంతులని, ప్రభుత్వ పథకాలను బాధ్యతాయుతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని ప్రశంసించారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, అవసరమైతేనే ప్రయాణాలు చేస్తూ మహిళలు ప్రభుత్వానికి సహకరిస్తున్నారు. వారి సహకారంతోనే ఈ పథకం ఇంత పెద్ద విజయం సాధించింది. వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు. గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే, ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చామని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల విద్యార్థినులు, మహిళలకు బస్ పాసుల కోసం క్యూ లైన్లలో నిలబడే శ్రమ తప్పిందని, ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో భాగంగా ఆర్టిక్యులేటెడ్ ఈ-బస్సుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

## ఉద్రిక్తతల మధ్య భారత్ మానవత్వం

హైకమిషన్ ఆదివారం ఈ మేరకు పాక్ ప్రభుత్వానికి సమాచారం అందించింది. సాధారణంగా సింధు జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీ) కింద ఇరు దేశాల కమిషనర్ల మధ్య ఇలాంటి సమాచార మార్పిడి జరుగుతుంది. అయితే, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఈ ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. అప్పటి నుంచి ఒప్పందం కింద సమాచార మార్పిడి జరగడం లేదు. ఈ నేపథ్యంలో దౌత్య కార్యాలయం ద్వారా హెచ్చరికలు పంపడం ఇదే తొలిసారి. భారత్ నుంచి అందిన సమాచారంతో పాకిస్థాన్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారని తెలుస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకున్న కఠిన చర్యలలో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని పక్కనపెట్టింది. అప్పటి నుంచి మూడు నదులకు సంబంధించిన నీటిమట్టాల వివరాలను పాక్‌తో పంచుకోవడం లేదు. రుతుపవనాల సమయంలో భారత్ ఇచ్చే ఈ సమాచారం, పాకిస్థాన్‌లో వరద నష్టాన్ని తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటీవల మే నెలలో ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ వాతావరణం నెలకొన్న తర్వాత, సంబంధాలు మరింత క్షీణించిన తరుణంలో భారత్ ఈ చర్య తీసుకోవడం ఒక సానుకూల పరిణామంగా అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయంపై ఇరు దేశాల ప్రభుత్వాల నుంచి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## రాష్ట్రస్థాయి ఓ బి సి సమావేశమునకు హాజరైన తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకులు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు సొంటి నాగరాజు అధ్యక్షతన తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో విజయవాడ నందు గల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నేడు జరిగినటువంటి రాష్ట్రస్థాయి ఓ బి సి సమావేశమునకు హాజరైన తిరుపతి జిల్లా కాంగ్రెస్ నాయకులు.రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజు మాట్లాడుతూ ఓబీసీలందరూ ఏకమై కలిసికట్టుగా రాజ్యాధికారం వైపు అడుగు వేయాలని, ఓబీసీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు, డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ రాబోయే రోజులు కాంగ్రెస్ పార్టీ వేనని బీసీల రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్ పార్టీ కి మాత్రమే చిత్తశుద్ధి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బల్ల హరి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్,బాలరాజు రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షులు సీతారాం,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఫయాజ్,జిల్లా అధికార ప్రతినిధి పర్వతాల శ్రీను గౌడ్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బాబు,శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, తడ మండలం అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,హరి,రవి, వినోద్, ఇళయరాజా, మురళి, మనీ, రాజిక్, తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా ఘనంగా గణేష్ నవరాత్రోత్సవాలను జరుపుకుందాం

- వేములవాడ ఏ.ఎస్పీ : శేషాద్రిని రెడ్డి పిలుపు
- సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాలి
- లేనియెడల చర్యలు తప్పవు
- గణేష్ ఉత్సవాలకు పోలీస్ శాఖ సంపూర్ణ సహకారం
- డీజే లకు "నో"- శాంతియుత వేడుకలకు "ఎస్"
- స్పష్టం చేసిన వేములవాడ ఏ.ఎస్పీ : శేషాద్రిని రెడ్డి



వేములవాడ (ప్రశ్న న్యూస్) ఈనెల 27నుండి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పూర్తి భక్తిభావంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ సబ్ డివిజన్ ఏ.ఎస్పీ శేషాద్రిని రెడ్డి డివిజన్ ప్రజలకు సూచించారు. నవరాత్రుల సందర్భంగా ప్రజలకు పలు సలహాలు,సూచనలు అందజేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ వారు రూపొందించిన ఆన్లైన్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకొని, అధికారుల సూచనలు,ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని మండపాల వద్ద తాత్కాలికంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని నిరంతరం నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ వారి డయల్ 100కి లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని కోరారు. పండగ ప్రారంభం నుండి నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎట్టి పరిస్థితుల్లో అధిక శబ్దాలను కలిగించే డీజే సౌండ్ బాక్సులను వినియోగించరాదని, డీజేల వినియోగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని,నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డీజెలు వినియోగిస్తే అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిజనిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను ఇతరులకు షేర్ చేయడం, గ్రూప్ లలో వైరల్ చేయడం చట్ట రీత్యా నేరమని, ఇలాంటి విషయాల్లో ఇప్పటికే చాలా మందిపై కేసులు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. నిమజ్జనం రోజున ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా విగ్రహాల నిమజ్జనం పూర్తి అయ్యేలా మండపాల నిర్వాహకులు కృషి చేయాలని, నిర్వాహకులకు సహకరించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని, ఇప్పటికే దీనికి సంబంధించి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు, అందించామని, ఈ క్రమంలో నిర్వాహకులతో పాటు సామాన్య ప్రజలు సైతం పోలీస్ శాఖకు సహకరిస్తే

## వినాయక ఆగమనం వేడుకలో



## రాష్ట్ర ప్రభుత్వ విప్ హాజరు

వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని విద్యానగర్ లో ఇండిపెండెన్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఆగమనం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధతో జరుపుకోవాలని సూచించారు.భక్తులు సంప్రదాయాలు,శాంతి,సామూహిక కట్టుబాటుతో పండుగను జరుపుకోవడం ద్వారా ఆధ్యాత్మిక,సాంస్కృతిక విలువలను కొనసాగించాలనే సందేశాన్ని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు,యూత్ సభ్యులు,గణపతి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రాజన్న సేవలో హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి

వేములవాడ (ప్రశ్న న్యూస్)గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి సోమవారం వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు,ఆలయ అర్చకుల వేదోక్త ఆశీర్వచనాలతో లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు ప్రోటోకాల్ సహాయక కార్యనిర్వాహణాధికారి గోవిందుల అశోక్ కుమార్, పర్యవేక్షకులు వేదాంతం శ్రీకాంతచార్యులు, ఓడెపు వెంకట ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మహేష్ యాదవ్, తదితర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో దొంగను అదుపులోకి తీసుకున్న జిల్లా పోలీసులు




- అంతర రాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్ - 8 బైకులు స్వాధీనం
- జిల్లా ఎస్పీ : మహేష్ బి గితే

సిరిసిల్ల /బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,ఈస్ట్ గోదావరి జిల్లా వూలపల్లి గ్రామానికి చెందిన అంబటి

## ఓటు చోరి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి - భాజపా డిమాండ్

-టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది
- వేములవాడ పట్టణ భాజపా నాయకులు : రేగుల సంతోష్ బాబు



వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ ప్రజాహిత యాత్రలో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో "ఓటు చోరీ" జరిగిందని, దాని వల్లనే బండి సంజయ్ గెలిచారని చేసిన వ్యాఖ్యలు వెంటనే బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ భాజపా నాయకులు రేగుల సంతోష్ బాబు మాట్లాడుతూ "కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేసి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. మోడీ నాయకత్వాన్ని, బండి సంజయ్ సేవలను మెచ్చి ఓటు వేసిన ప్రజలను అవమానించడం, వారి ఓటు హక్కును అపహాస్యం చేయడం సరికాదు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మహేష్ వ్యాఖ్యలు ఉన్నాయి. వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని భేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి," అని డిమాండ్ చేశారు.అలాగే, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వం ఏర్పాటు అయినట్లు గుర్తుచేస్తూ, అదే తీర్పును గౌరవించడం బీజేపీ కోరింది. "మహేష్ ఇలాంటివి మాట్లాడితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు ఉండదు. మీరు ఓటర్లను అపహాస్యం చేస్తున్న తీరు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తాము. మీ ప్రభుత్వ తప్పిదాలను ఎక్కడికక్కడ బయటపెడతాం," అని రేగుల సంతోష్ బాబు స్పష్టం చేశారు.

## మధ్య మానేరు నిర్వాసితులకు హామీ ఇచ్చిన పరిహారం వెంటనే చెల్లించాలి

- నిర్వాసితుల సమస్యా పరిష్కారాన్ని ప్రభుత్వం విస్మరించడం అన్యాయం
- భాజపా అర్బన్ మండలాధ్యక్షులు : బుర్ర శేఖర్ గౌడ్
- మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ర్యాలీ
- తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత



వేములవాడ (ప్రశ్న న్యూస్) మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. నిర్వాసితులకు ఇస్తామని హామీ ఇచ్చిన ఐదు లక్షల నాలుగు వేల రూపాయల పరిహారం తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ వేములవాడ అర్బన్ బీజేపీ అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో భాజపా నాయకులతో కలిసి



బైక్ ర్యాలీ నిర్వహించారు.నంది కమాన్ చౌరస్తా నుండి ప్రారంభమైన ర్యాలీ వేములవాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, "మిడ్ మానేరు నిర్వాసితులు ఎన్నో సంవత్సరాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. నిర్వాసితులకు ప్రకటించిన ఐదు లక్షల నాలుగు వేల రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలి.లేనియెడల బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుంది" అని హెచ్చరించారు. అలాగే, "ప్రభుత్వం నిర్వాసితుల సమస్యల పరిష్కారాలను విస్మరించడం అన్యాయం. మానవతా దృక్పథంతో వెంటనే చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

## దమ్ముంటే నిరూపించు లేదా పిసిసి పదవికి రాజీనామా చేయాలి - చిట్యాల సురేష్



మేడిపల్లి(ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ మేడిపల్లి మండలం కేంద్రంలో జరిగిన ప్రజా హిత కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ గెలుపు పై తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచారని ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన అనుచిత వ్యాఖ్యలను మేడిపల్లి భీమారం మండలాల బిజెపి అధ్యక్షులు తీవ్రంగా ఖండించారు.సోమవారం మేడిపల్లి మండల కార్యాలయంలో మేడిపల్లిభీమారం మండలాల బీజేపీ అధ్యక్షులు చిట్యాల సురేష్ నాగం శివ కుమార్ లు మాట్లాడుతూ మహేష్ కుమార్ తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు హోదాలో ఉండి ఇలాంటి అర్థం పర్థం ఆధారాలు లేని మాటలు మాట్లాడం తగదని చిట్యాల సురేష్ అన్నారు.చొప్పదండి హుస్నాబాద్ వేములవాడ నియోజక వర్గాలు కూడా కరీంనగర్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయని అక్కడ గెలిచిన మీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా దొంగ ఓట్లు తోనే గెలిచారా అని ప్రశ్నించారు.అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నిజాలను నిరూపించాలని లేదంటే పిసిసి అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని లేదా తెలంగాణ ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.క్షమాపణలు చెప్పని ఎడల వారు చేపట్టిన ప్రజాహిత యాత్రను ఎక్కడిక్కడే ముట్టడిస్తామని లేదంటే దిష్టి బొమ్మలు దహనం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ రెండు మండల అధ్యక్షులతో పాటు మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు సీనియర్ నాయకులు ఎస్ ఎన్ రెడ్డి తౌటి తిరుపతి రెడ్డిమామిడి ధర్మారెడ్డి రాచర్ల హనుమాండ్లు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ నీలం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పోత్సహించండి... స్ఫూర్తినింపండి

"వజ్రం అయినా సానబెడితేనే దాని విలువ తెలుస్తుంది. అలాగే మట్టిలో మాణిక్యాలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల సాధించిన ఫలితాలు వారి సమర్థతను రుజువు చేస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ-నీట్ సెంటర్లలో కోచింగ్ పొంది ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్ లలో 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సీట్లు సాధించారు. సచివాలయంలో నన్ను కలిసిన సందర్భంగా, వారు తమ సంతోషాన్ని నాతో పంచుకుంటే ఎంతో సంతృప్తి కలిగింది. ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీట్లు పొందిన వారికి మెమొంటోతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష ప్రోత్సాహకం అందించి అభినందించాను. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపయోగపడేలా కొత్తగా మరో 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. సరైన సదుపాయాలు, శిక్షణ, సాయం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా మన విద్యార్థులకు ఉంది. వీరి విజయం ఎంతో మందికి స్ఫూర్తినివ్వాలని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు వివరించారు. తమ విజయానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, గురుకులాల్లో లభించిన నాణ్యమైన విద్య ఎంతగానో దోహదపడ్డాయని విద్యార్థులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని వారు పేర్కొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యం

ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పద్మ విభూషణ్ గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణులు డా. నాగేశ్వర్ రెడ్డి, డా. జీవీ రావు సమక్షంలో రాష్ట్ర రహదారుల మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యం. నల్గొండ, పరిసర గ్రామాల్లో ప్రజలు ఖరీదైన లాప్రోస్కోపీ సర్జరీ కోసం హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు స్థానికంగానే ఈ సేవలు పొందగలరు" అని తెలిపారు.

లాప్రోస్కోపీ సర్జరీలు అంటే చిన్న రంధ్రాల ద్వారా నిర్వహించే ఆధునిక శస్త్రచికిత్సలు. ఇవి రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, తక్కువ ఇన్ఫెక్షన్ ప్రమాదం కలిగించడంతో పాటు తక్కువ రోజుల్లోనే కోలుకునే అవకాశం కల్పిస్తాయి. అందువల్ల ఈ సాంకేతికతను "మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ" అని కూడా పిలుస్తారు.

నల్గొండలో ఇలాంటి సదుపాయం అందుబాటులోకి రావడం వైద్యరంగంలో ఒక పెద్ద ముందడుగు అని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు.కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరఫున ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈసారి ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు, కొత్త విభాగాలు ఏర్పాటు చేసే దిశగా కృషి కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. "ప్రైవేట్ ఆసుపత్రులు మాత్రమే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఉత్తమ సదుపాయాలు ఉండాలి. పేద, మధ్యతరగతి ప్రజలు కూడా అధునాతన వైద్యం పొందగలగాలి" అని అన్నారు.

వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న డా. నాగేశ్వర్ రెడ్డి, జివి రావు గారితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో సంతోషం కలిగించిందని మంత్రి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఇక ఇదే కార్యక్రమంలో పాల్గొన్న డా. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధునాతన చికిత్స అందించడం సమాజానికి గొప్ప సహకారం అని ఇలాంటి యూనిట్లు మరిన్ని జిల్లాల్లో స్థాపించబడాలని ఆకాంక్షించారు. నల్గొండ జిజిహెచ్ లో లాప్రోస్కోపీ యూనిట్ ప్రారంభం కావడంతో భవిష్యత్తులో వందలాది రోగులు స్థానికంగానే నిపుణుల సలహాలు, శస్త్రచికిత్సలు పొందే అవకాశం ఉంది.

## ఖమానాలో పేకాట స్థావరంపై

# పోలీసుల దాడి, ఐదుగురి అరెస్ట్

ఆదిలాబాద్, : వాంకిడి మండలం ఖమానాలో సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం, పట్టుబడిన వారి నుంచి రూ.10,820 నగదును స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# కాంగ్రెస్ హామీలపై బీజేపీ ఆగ్రహం

బోథ్, : గుడిహత్నూర్ లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆరోపిస్తూ, సోమవారం బీజేపీ పార్టీ నేతృత్వంలో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రాహ్మణంద్ మాట్లాడుతూ, ప్రజలకు వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# గాదిగూడలో ఇందిరమ్మ ఇల్లు

ఖానాపూర్, : గాదిగూడ మండలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు విష్ణు నాయక్ డిమాండ్ చేశారు. తోయగూడ గ్రామానికి తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని, తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న పవార్ గోపాల్‌కు ఇల్లు మంజూరు చేయాలని వారు అభిప్రాయపడ్డారు. అన్నదాతల ఇల్లు కూడా మంజూరు చేయాలని విశ్లేషణ చేశారు.

## బహుజనుల అభివృద్ధికి

# బీపీ.మండల్ ఆశయాలు సాధిద్దాం

ముథోల్, : జన్నారంలో బీసీ ఉద్యమ పోరాట సమితి నాయకులు బీపీ.మండల్ జయంతిని



పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన మండల్ ఆశయాలను సాధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు అడేపు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ గౌడ్, అశోక్, కడార్ల నరసయ్య, రాగుల శంకర్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు. మండల్ బహుజనుల పక్షపాతి అని నాయకులు కొనియాడారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం

# జన్నారంలో నిరసన దీక్ష

నిర్మల్, : బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘం జన్నారం మండల నాయకులు సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హైదరాబాదులో చేపట్టిన దీక్షకు మద్దతుగా ఈ నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఐక్య ఉద్యమ పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

# మండపాలకు గణనాథులు

కరీంనగర్, : బుధవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, నవరాత్రి ఉత్సవాల కోసం గణేష్ మండపాల నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం, కోరుట్ల, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్దపెద్ద గణనాథుల విగ్రహాలను మండపాలకు తరలించారు. ఈ విగ్రహాల తరలింపుతో పండుగ వాతావరణం నెలకొంది.

## బావిలో పడిన వృద్ధురాలిని కాపాడిన ఫైర్ సిబ్బంది

చొప్పదండి, : చొప్పదండి పట్టణంలో సోమవారం జరిగిన సంఘటనలో, 13వ వార్డుకు చెందిన



పంచల భాగ్యలక్ష్మి అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. సమాచారం అందిన వెంటనే చొప్పదండి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పి. పవన్ నేతృత్వంలో ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగి, తాళ్ల సహాయంతో వృద్ధురాలిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో సిహెచ్ నరేందర్, ఈ శశి కుమార్, జి. గణేష్, కె. సత్తయ్య, బి. అరుణ్ కుమార్ వంటి ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో

## నూతన హెచ్ఎం రమేష్‌కు

# ఘన సన్మానం

హుజూరాబాద్, : కరీంనగర్ కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రైమరీ స్కూలుకు నూతనంగా హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన కన్నం రమేష్ ను పట్టణ వాస్తవ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వాసల రమేష్, మాజీ కౌన్సిలర్ స్వర్గం నర్సయ్య, గుంటుక వంశీధర్, చిట్కూరి శ్రీనివాస్, పొన్నం శ్రీను, భోగ రమేష్, భోగ సుదర్శన్, వంగ మహేందర్ తదితరులు పాల్గొని, పూల బొకే, శాలువాతో ఆయనను గౌరవించారు.

## మెట్ పల్లిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

జగిత్యాల, : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఉత్తర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్రానికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, చక్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు 18,51,108 ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హారతులు, తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది.

## కోరుట్ల, మెట్‌పల్లి విద్యార్థులకు టీ-హబ్ సందర్శన

కోరుట్ల, : కోరుట్ల మరియు మెట్‌పల్లి పట్టణాలలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లోని టీ-హబ్, టీ వర్క్స్ సందర్శించారు. మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో, తెలంగాణలో ప్రపంచ స్థాయి టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పడటం రాష్ట్రానికి గర్వకారణమని, ఇవి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి, భవిష్యత్తులో స్టార్టప్‌ల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ ప్రత్యేక ప్రయత్నంతో నియోజకవర్గ యువతకు కొత్త దిశగా అవగాహన లభిస్తున్నదని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు సమస్యలపై బీజేపీ ధర్నా..

పెద్దపల్లి, : రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ పెద్దపల్లి రూరల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పెద్దపల్లి రూరల్ మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

## రైతులకు సస్యరక్షణపై వీడియో కాన్ఫరెన్స్:

సత్తుపల్లి, : మంగళవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు వేంసూరు మండల కేంద్రంలోని రైతువేదిక సమావేశ మందిరంలో రైతులు వ్యవసాయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి పచ్చల రాంమోహన్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త బసివిరెడ్డి పాల్గొని, రైతుల సందేహాలపై వర్చువల్ గా సమాధానాలు ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## వరి సాగుకు యూరియా

## సరఫరా చేయాలని రైతుల డిమాండ్

ఖమ్మం, : వేంసూరు మండలంలోని రైతులు తమ ఆహార పంట వరి సాగుకు సరిపడినంత యూరియాను సహకార సంఘాల ద్వారా సబ్సిడీతో సరఫరా చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం వేంసూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో తహశీల్దార్ మాణిక్ రావుకు వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కూడా ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రామలక్ష్మి, పిల్లి భాస్కర్ తో పాటు రావి నారాయణరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి రెడ్డికి మంత్రి నివాళి

మధిర, : వేంసూర్ మండలం అడవి రామన్నపాలెం గ్రామానికి చెందిన దొడ్డ గణపతి రెడ్డి ఇటీవల మరణించారు. సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయా విజయ్ కుమార్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబాలకు పరామర్శ

వైరా, : వేంసూరు మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత దొడ్డా గణపతిరెడ్డి, వెలగపూడి బాబురావు మేనల్లుడు ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఇరువురు కుటుంబాలను పరామర్శించి, మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కల్లూరుగూడెం గ్రామ కాంగ్రెస్ నేత రాచూరి గంగరాజును కూడా అనారోగ్యంతో ఉన్నప్పుడు కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మట్టా దయానంద్, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మారిన కాటారం బస్ షెల్టర్

భూపాలపల్లి, : భూపాలపల్లి జిల్లా కాటారంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్సు షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగపడటంలేదు. గారేపల్లి – మంథని రహదారిపై ఉన్న ఈ షెల్టర్ ఆర్టీసీ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారింది. గతంలో బస్సులు షెల్టర్ ప్రాంగణంలోకి వచ్చేవి, కానీ ఇప్పుడు రోడ్డుపైనే నిలుపుతున్నారు. చెట్లు పెరిగిపోవడంతో ఈ షెల్టర్ ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

## అదరగొట్టిన చిచ్చర పిడుగు

ములుగు, : భూపాలపల్లి జిల్లా రామన్న నగర్ కు చెందిన యూకేజీ విద్యార్థిని చేని శ్రీనిక తన అద్భుతమైన జ్ఞాపకశక్తితో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ చిన్నారి కేవలం 37 సెకన్లలో దేశంలోని 29 రాష్ట్రాల పేర్లతో పాటు వాటి రాజధానులను అనర్గళంగా చెబుతోంది. తల్లిదండ్రులు చేని మౌనిక–శ్రీనివాస్, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆమె మేధోశక్తిని పెంచుకుంటోంది. గతంలో కేంద్ర మంత్రుల పేర్లు, వారి శాఖలను చెప్పి బంగారు పతకం సాధించింది.


## యూరియా కోసం

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

వరంగల్ ఈస్ట్, : వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం అంబేద్కర్ సెంటర్ లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మద్దతు తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొండేటి శ్రీధర్ గృహ నిర్బంధం

## పాదయాత్రకు పోలీసుల ఆంక్షలు



పాలకుర్తి, : జనహిత పాదయాత్ర నేపథ్యంలో, హన్మకొండ జిల్లా వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు మరియు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్‌ను సుబేదారి పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ప్రతి ఒక్క రైతుకు యూరియా అందిస్తాం

మెదక్, : నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంటలో సోమవారం యూరియా లోడ్ లారీ రావడంతో సొసైటీ వద్ద రైతులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. సొసైటీ నిర్వాహకులు, పోలీసుల ఆధ్వర్యంలో రైతుల నుంచి పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని ఒక్కొక్కరికి రెండు యూరియా సంచులు అందించారు. ప్రభుత్వం రైతులకు యూరియా అందించే విషయంలో దృష్టి సారించిందని, ప్రతి రైతుకు యూరియా అందుతుందని అధికారులు తెలిపారు.

## యూరియా కేంద్రాల వద్ద ఆధార్ కార్డుతో రైతులు

నర్సంపేట, : కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం ఉదయం యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచే ఆధార్ కార్డులతో వేకువజామున నుంచే లైన్లో నిల్చున్నారు. పంటలు కీలక దశలో ఉండగా, యూరియా లభించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. గత కొన్ని రోజులుగా అవసరమైన యూరియా లభించకపోవడంతో, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు తెలిపారు.

# బీపీ మండల్ 107వ జయంతి



హుస్నాబాద్, : భారతదేశంలో రిజర్వేషన్లకు ఆద్యుడైన బీపీ మండల్ 107వ జయంతి ఉత్సవాలను హుస్నాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ చేయడం లింగమూర్తి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు గంపల శ్రీనివాస్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్క అనిల్ గౌడ్ వంటి పలువురు నాయకులు, వివిధ బీసీ కుల సంఘాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బీఎస్పీ ఆధ్వర్యంలో బీపీ మండల్

# 107వ జయంతి వేడుకలు

సిద్దిపేట, : హుస్నాబాద్ పట్టణంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బీపీ మండల్ 107వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ హయాంలో బీసీల సమస్యలపై బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ బీసీల సమస్యలపై 40 అంశాలతో నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా, ప్రధానమంత్రి వీపీ సింగ్ హయాంలో విద్య, ఉద్యోగ రంగాలలో 27% రిజర్వేషన్లు కల్పించారు.

## అయ్యప్ప స్వామికి మహా అభిషేకం, అర్చన

గజ్వేల్, : కరీంనగర్ రోడ్ సిద్దిపేటలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శబరి గిరీషా సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రం సందర్భంగా మహా అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## గజ్వేల్‌లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

దుబ్బాక, ఆగస్టు 25(ఎ.ఎం.ఎస్): గజ్వేల్‌లో సోమవారం బీజేపీ నాయకుడు కమ్మరి శ్రీను, సౌజన్యంతో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

## క్రీడల ద్వారా యువత

# రాష్ట్ర ప్రతిష్ఠను నిలబెట్టాలి



నారాయణపేట, : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం 2కే రన్ ఘనంగా నిర్వహించారు. శ్రీనల్లజర్లమ్మ దేవాలయం నుంచి ప్రభుత్వ కళాశాల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణను పెంపొందిస్తాయని, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపి రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీసీ రిజర్వేషన్ల ప్రదాత మండల్ కు

# భారతరత్న ఇవ్వాలి

జడ్చర్ల, : జడ్చర్ల లో ప్రజా సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మండల్ కమిషన్ చైర్మన్ బీపీ మండల్ 107వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగానే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం సమాన వాటా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహనీయుని జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని, భారతరత్న ఇవ్వాలని కోరారు.

## ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

## చేతుల మీదుగా అభివృద్ధి పనుల ప్రారంభం

మహబూబ్‌నగర్, : దేవరకద్ర పట్టణంలో రూ. కోటి 10 లక్షల నిధులతో మహబూబ్ నగర్ – రాయచూర్ రోడ్డు నుండి పట్టణంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డు నిర్మాణానికి, రాయచూర్ వైపు సబ్ వర్క్ పనులకు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రీ ఈశ్వర వీరప్పయ్య దేవస్థానం ఆలయం అర్చకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జూరాలకు కొనసాగుతున్న వరద 35 గేట్లు ఎత్తివేత

వనపర్తి, : వనపర్తి జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 6 గంటలకు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 7.407 టీఎంసీలుగా ఉంది. ఇన్ ఫ్లో 3.60 లక్షల క్యూసెక్కులు వస్తుండటంతో, 35 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు కూడా నీటిని వదులుతున్నట్లు, మొత్తం అవుట్ ఫ్లో 3,40,955 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు.

# సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా జరిపించాలి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంచార జాతుల విముక్తి దినోత్సవంగా ఆగస్టు 31న అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ డి ఎన్ టి అడ్వకేట్స్ ఫోరం అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది గుండ్లపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పత్రిక సమావేశంలో మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానమంత్రి కీ?శే జవహర్లాల్ నెహ్రూ 1936లో నెల్లూరు బహిరంగసభలో "ఈ క్రిమినల్ ట్రయిబ్ యాక్ట్ అనే పదాలు అన్ని గ్రంథాల్లో నుంచి, అన్ని పుస్తకాల్లో నుంచి తొలగించాలని, ఈ చట్టం పౌరస్వేచ్ఛని నిషేధించి, సంఘటితం కాకుండా చేసింది అని ప్రసంగించినారు. ఆ మహానుభావుడు చొరవతో 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం రాగానే మొట్టమొదట ఈ సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల కోసం క్రిమినల్ ట్రయిబ్ ఎంక్వైరీ కమిటీ వేసినారు, 1949లో అనంతశయనం అయ్యంగార్ కమీషన్ వేయగా, 1960లో తన రిపోర్ట్ ఇచ్చినారు. ఆ కమీషన్ రిపోర్ట్ ఆధారంగా తేది. 31-08-1952 రోజున భారతదేశం మొత్తంలో 1871 నుండి నోటి సైడ్ అయిన దాదాపు 500 కులాలను డీ నోటిఫైడ్ చేస్తూ, విముక్త జాతులుగా ప్రకటించడం జరిగినదన్నారు. ఆరోజును గుర్తు చేసుకుంటూ ఈ కులాల వారు ఆగస్టు 31వ తేదీని విముక్త జాతుల దినోత్సవంగా భారతదేశం అంతటా జరుపుకోవటం ఆనవాయితి గా మారిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 12 శాతం జనాభా సంచార , అర్ధసంచార, విముక్త జాతుల వారు బిసి, యస్సీ, యస్టీ. మైనారిటీలలోయున్నారు. వీరికి సంబంధించిన ఆగస్టు 31 వ తారీఖు విముక్త జాతుల దినోత్సవాన్ని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భారత దేశంలో దాదాపు



500 కులాలు / జాతులుతెలంగాణా రాష్ట్రంలో వీరు బిసి, యస్సీ, యస్టీ, మైనారిటీలలో దాదాపు 74 కులాలు / జాతులు 12 శాతం జనాభా ఉన్నారు ప్రతి సంవత్సరం ఆగస్టు 31 వ తారీఖున భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆయా జాతుల వారు ఈ విముక్త జాతుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇందుకు అనుబంధంగా



మహారాష్ట్ర ఉత్తరప్రదేశ్,హర్యానా,మధ్యప్రదేశ్, ఢిల్లీ,గుజరాత్ ఇలా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ఈ విముక్త జాతుల దినోత్సవాన్ని జరుపుచున్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బడుగు బలహీన వర్గాలకు చేయూతనిస్తూ సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నటువంటి తెలంగాణ ప్రభుత్వం తప్పకుండా ఆగస్టు 31 తేదిన సంచార జాతుల విముక్త దినోత్సవాన్ని తెలంగాణ లో 12 శాతం ఉన్న సంచార జాతుల ఆత్మగౌరవ ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికముగా జరిపించిలని కోరారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భారీ ఆందోళన
- అసెంబ్లీ కన్వీనర్ శ్రవణ్ కుమార్ నేతృత్వంలో బీజేపీ కార్యకర్తలు మధురానగర్ చౌరస్తాలో ర్యాలీ
- దిష్టిబొమ్మ దహనం చేసి కాంగ్రెస్ పార్టీ విధానాలను ఖండించిన నిరసనకారులు
- ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలింపు



**గంగాధర (ప్రశ్న న్యూస్)** కేంద్ర హెూం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ పై టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు ప్రతిగా, చొప్పదండి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు గంగాధర మండలం,మధురానగర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున



ఆందోళనలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించారు.ఈ సందర్భంగాపెరుక శ్రవణ్ కుమార్,మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై చేసిన విమర్శలను ఖండించారు. ఆయన మాట్లాడుతూ "ప్రజాహిత యాత్ర పేరుతో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. యాత్రల పేరుతో అబద్ధ ప్రచారాలు జరుపుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇలాంటి ప్రవర్తన కాంగ్రెస్ పార్టీ సంస్కారాన్ని ప్రతిబింబిస్తుంది."అని అన్నారు.పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మహేష్ కుమార్ గౌడ్,కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక నినాదాలు చేశారు. ఉద్రిక్తత పెరిగినందున,భారీగా పోలీసులు మోహరించి బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని గంగాధర, రామడుగు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సంఘటన స్థానిక రాజకీయ వాతావరణంలో ఉద్రిక్తతను సృష్టించిందని సమీక్షకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ,జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఎడవల్లి శశిధర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు మోడీ రవి,గాజుల మల్లేశం, బండ నరసింహ రెడ్డి,ఎడపల్లి పరుశు రాం,మొగిలి మహేష్, మాజీ మండల అధ్యక్షులు కోలా అశోక్, రేగులపల్లి రవీందర్ రెడ్డి ,గుడి రవీందర్ రెడ్డి,సంఘని రవి,తూమ్ నారాయణ, మల్యాల వినయ్ సాగర్, ఆకుల మనోహర్,జిల్లా యువ మోర్చా నాయకులు ఎడవల్లి లక్ష్మణ్, ఎడవెల్లి రామ్, శ్రీనివాస్ రెడ్డి,రేండ్ల శ్రీనివాస్, వోడ్నాల రాజు కోక్కర మల్లేశం యాదవ్,పూరెల్ల శ్రీకాంత్, తాళ్ల రాజశేఖర్,చిందం ఆంజనేయులు,మాడిశెట్టి జయంత్, సుంకే అనిల్, దేశెట్టి శ్రీనివాస్, దయ్యాల రాజు, సురేష్, నక్క ఆనందం, కటకం హర్షవర్ధన్, బుడిగ సురేష్, జిల్లా గంగరాజన్, పరుశురాం, నీలం రవి, గుట్ల ఐలయ్య, సింగరి వెంకటేష్, సవనపల్లి మధు, ఎడపల్లి ధర్మేంద్ర, విలాసాగర్ లచ్చయ్య, బొంగుని వినయ్ తదితర భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పెట్టండి పర్యావరణాన్ని కాపాడండి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం శుభోదయం మానసిక దివ్యంగుల సెంటర్లో మానసిక దివ్యంగుల తో చేయించిన మట్టి వినాయక విగ్రహాలను మండలంలోని వివిధ అధికారులకు అనగా ధర్పల్లి మండల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్,యం పి డి ఓ జి. లక్ష్మారెడ్డి,యం పి ఓ రాజేష్ లను సెంటర్ కి ఆహ్వానినించి మట్టి విగ్రహాలను అందివ్వడం జరిగింది. అందరు మట్టి వినాయకుల ను పూజించే లాగ అవగాహనా కలిగించాలనీ కోరడం జరిగింది.అధికారులకు ప్రతిమలను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి సి బుచ్చన్న, కార్యకర్త నర్సవ్వ, వర్కర్ సి బి ఆర్ వర్కర్ స్వప్న లు పాలుగొనడం జరిగింది.

## నేడే వేములవాడ లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

- బండి సంజయ్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్ పిలుపు



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో నేటి మంగళవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు,కేంద్రమంత్రి బండి సంజయ్ పర్యటనలో భాగంగా వారి చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10 వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారని,ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు,నాయకులు, హిందూ బంధువులు, వేములవాడ పట్టణ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ చేస్తున్నది ప్రజా హిత యాత్ర కాదు - ప్రజా గోస యాత్ర

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ ను ఖతం చేసే యాత్ర
- ఓటర్ల మనోభావాలు దెబ్బతీసిన మహేష్ గౌడ్ వ్యాఖ్యలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- భేషరతుగా ప్రజలకు మహేష్ గౌడ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి
- కరీంనగర్ అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో బండి సంజయ్ స్ఫూర్తి హర్షణీయం
- ఓటు చోరీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్ డిమాండ్



వేములవాడ (ప్రశ్న న్యూస్) కరీంనగర్‌లో బండి సంజయ్ పనులను ప్రశంసిస్తూ బీజేపీ స్థానిక నేతలు మహేశ్ గౌడ్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వేములవాడ బీజేపీ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రవర్తనను "ప్రజా హిత యాత్ర కాకుండా ప్రజా గోస యాత్ర"గా అభివర్ణించారు. "ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌ను ఖతం చేసే యాత్ర"గా పేర్కొన్నారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలను "దొంగ ఓట్లు వేశారని" బండి సంజయ్ గెలిచారని చెప్పడం ద్వారా అవమానించినట్లు అభిప్రాయపడ్డారు. మహేశ్ గౌడ్ వెంటనే కరీంనగర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సీపీఎం నేతలు చేసిన పూర్వ వ్యాఖ్యలను కూడా సూచిస్తూ, బండి సంజయ్ ఎప్పుడూ కరీంనగర్ అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్నారని రాపెల్లి శ్రీధర్ తెలిపారు. 2019 ఎంపీ ఎన్నికల్లో 89,500 ఓట్ల మెజారిటీతో గెలిచిన బండి సంజయ్, తాజాగా 2,25,000 ఓట్లకుపైగా భారీ మెజారిటీతో విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు.బండి సంజయ్ ఎంపీ ల్యాడ్స్ కింద 20 వేల కోట్ల రూపాయల పైగా అభివృద్ధి నిధులు కరీంనగర్‌కు తీసుకొచ్చారని, ముఖ్యంగా 4-లేన్ రోడ్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జీలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,విద్య, రైల్వే స్టేషన్ ఆధునీకరణ, సైనిక్ స్కూల్ ఏర్పాటు వంటి ప్రధాన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని వివరించారు.రాజకీయ దృష్టికోణం నుంచి, కాంగ్రెస్ పార్టీ నేతలు హిందూ,బీసీ సమూహాలపై తప్పుడు దావాలు చేసి అవమానించినట్లు ఆయన ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టారని, కానీ బీసీల గురించి మాట్లాడలేదని కూడా విమర్శించారు."కరీంనగర్ ప్రజలే ఆశ, శ్వాసగా బతుకుతూ, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడే బండి సంజయ్ పై విమర్శలు అనర్థం. స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిజానికి ఎవరు నిజంగా పనిచేస్తున్నారో తేల్చుకుంటారు" అని కాంగ్రెస్ నేతలకు రాపెల్లి శ్రీధర్ సవాల్ విసిరారు.

## దుబ్బరాజేశ్వర స్వామి హుండీ లెక్కింపులో రూ.15,46,421/-

-జగిత్యాల డివిజన్ దేవాలయ పరిశీలకులు రాజమొగిలి, దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పోరండ్ల శంకరయ్య,ఈఓ అనూష



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)పెంబట్ల కోనాపూర్ శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవస్థానము నందు హుండీ లెక్కింపు చేయగా 15 లక్షల 46 వేల 4 వందల 21 ం ా ా ు ం ం ం (రూ.15,46,421/-) మాత్రమే వచ్చినవి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజమొగిలి, దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పోరండ్ల శంకరయ్య,రేనరేషన్ కమిటీ సభ్యులు రంగు శంకర్ గౌడ్, పిన్నం సత్యం, పంగ కిష్టయ్య, పెంబట్ల,కోనాపూర్ పంచాయతీ కార్యదర్శులు, యూబిఐ జగిత్యాల బ్యాంకు సిబ్బంది, సేవాసమితి వాలంటీర్లు పాల్గొన్నారని తెలిపారు.సారంగాపూర్ పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారని కార్యనిర్వహణాధికారి అనూష తెలిపారు.

## రేవంత్ రెడ్డి ఓయూ విద్యార్థి సంఘాల మాటలను నమ్మి ముందుకు వెళ్లండి - స్వామి గౌడ్

గత ముఖ్యమంత్రి కెసిఆర్ ఓయూ అధికారుల మాయ మాటలను నమ్మి మోసపోయారు



ఓయూ (ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నత అధికారులు తమ యొక్క స్వార్ధ ప్రయోజనాలను చూసుకోవడం వలన, ఓయూ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి చెందలేదు కాబట్టి ఈరోజు ఓయూకు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడే దమ్ముందా? తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2014 నుండి ప్రస్తుత అకాడమీ వరకు విద్యార్థులు మెస్ బకాయిలను చెల్లించలేకపోవడం వలన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు ప్రభుత్వ , ప్రైవేటు ఉద్యోగాలు సాధించినప్పటికీ విద్యార్థులు మెస్ బకాయిలను చెల్లించలేని ఆర్థిక పరిస్థితుల వల్లన సాధించిన ఉద్యోగాలను కోల్పోవల్సి వచ్చింది. కొట్లాడి, పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఏదైతే నీళ్లు, నిధులు, నియామకాలు కోసం కొట్లాడారో ఆయా రంగాలలో గత నియంత ప్రభుత్వం వలన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవలసి వచ్చింది. కనీసము ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే మీరైనా యూనివర్సిటీలో ఉన్న అన్ని విద్యార్థి సంఘాలను మరియు విద్యార్థులతో కలిసి మాట్లాడితే ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించినటువంటి సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తారు, ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నత అధికారులు మాయ మాటలను నమ్ముకుంటే మిమ్మల్ని నట్టేట ముంచేస్తారు. ఈ కార్యక్రమంలో కౌశిక్, మహేష్,రమేష్, నిఖిల్, సతీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ బొజ్జల బృందమ్మ



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి గాంధీ వీధిలోని 11వ చౌక దుకాణంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్మార్ట్ కార్డు ఉపయోగించి రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా ఏ చౌక దుకాణం నుంచైనా నిత్యవసర సరుకులు తీసుకోవచ్చు అన్నారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణానికి కూడా ఈ స్మార్ట్ కార్డు ఉపయోగపడు తుందన్నారు. ఫింగర్ ప్రింట్ పడకుండా ఇబ్బంది పడే వారికి ఈ స్మార్ట్ కార్డ్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. రేషన్ అక్రమ రవాణా నరికట్టడానికి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్ది సినిమాను తిరస్కరించిన నటి



ప్రస్తుతం ఇండియాలోనే టాప్ స్టార్లలో ఒకడు రామ్ చరణ్. ఆర్ఆర్ఆర్ సినిమాతో అతను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించాడు. అలాంటి హీరో సినిమాలో కీలక పాత్ర చేయమంటే ఏ నటి అయినా సంతోషంగా ఒప్పుకుంటుంది. కానీ మలయాళ నటి స్వశిక మాత్రం చరణ్ కొత్త చిత్రం పెద్ది కోసం అడిగితే నో చెప్పేసిందట. ఆ చిత్ర బృందం నుంచి తనను మళ్లీ మళ్లీ అడిగినా ఆ సినిమా చేయను అనేసిందట. ఇంత క్రేజీ ప్రాజెక్టులో నటించడానికి ఆమెకు వచ్చిన అభ్యంతరం ఏంటి అనిపించడం సహజం. ఐతే ఇందులో ఆమెకు ఆఫర్ చేసింది చరణ్ తల్లి పాత్ర అట.స్వశిక వయసు ప్రస్తుతం 33 ఏళ్లే. రామ్ చరణ్‌కేమో 40 ఏళ్లు వచ్చేశాయి. స్వశిక తమిళ, మలయాళ భాషల్లో కొన్ని మిడిలేజ్డ్ పాత్రలు చేసిన మాట వాస్తవం. ఆమె ఎక్కువగా క్యారెక్టర్ రోల్సే చేస్తోంది. అంత మాత్రాన చరణ్ కంటే ఏడేళ్లు తక్కువ వయసున్న అమ్మాయిని తనకు తల్లిగా నటించమని అంటే ఫీలవ్వకుండా ఉంటుందా? తాను ఇప్పుడే ఆ తరహా పాత్రలు చేయాలనుకోవడం లేదని.. అందుకే ఆ సినిమాకు ఎన్నిసార్లు అడిగినా ఓకే చెప్పలేదని స్వశిక వెల్లడించింది. స్వశిక 2009 నుంచి సినిమాల్లో నటిస్తోంది. తమిళంలో వాగై అనే చిత్రంతో ఆమె కథానాయికగా పరిచయం అయింది. తర్వాత తమిళం, మలయాళంలో పలు చిత్రాల్లో నటించింది. తెలుగులోనూ ఎటు చూసినా నువ్వే అనే చిన్న సినిమాలో నటించింది స్వశిక. ఐతే ఈ మధ్య తమిళం, మలయాళంలో ఆమె చేసిన కొన్ని క్యారెక్టర్ రోల్స్ బాగా క్లిక్ అయ్యాయి. ముఖ్యంగా సూరి హీరోగా చేసిన మామన్ చిత్రంలో ఆమె చేసిన అక్క పాత్రకు చాలా పేరొచ్చింది. అదే సమయంలో ఆమె తెలుగులోకి తమ్ముడు చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో అడవిలో ట్రక్కు నడిపే వెరైటీ పాత్రలో నటించింది స్వశిక. కానీ ఆ చిత్రం డిజాస్టర్ కావడంతో ఆమెకు తెలుగులో బ్రేక్ రాలేదు. చరణ్ సినిమాలో తల్లి పాత్ర చేస్తే మంచి పేరే వచ్చేదేమో కానీ.. అది తన వయసుకు తగ్గ పాత్ర కాకపోవడంతో నో చెప్పింది. ప్రస్తుతం తమిళంలో ఆమె సూర్య హీరోగా నటిస్తున్న కరుప్పు చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. తమిళం, మలయాళంలో ఆమె చేతిలో చాలా సినిమాలే ఉన్నాయి.

# పాత సినిమాలు చూడడం మానేశాను!



ఏ నటుడైనా తాను నటించిన పాత సినిమాలు చూస్తే మంచి అనుభూతికి లోనవడం సహజం. అందులోనూ తన హిట్ సినిమాలను చూస్తే మరింత ఆనందం కలుగుతుంది. కానీ తనకు మాత్రం తన పాత చిత్రాలను చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని అంటున్నాడు మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్. ఈ మధ్య ఆ సినిమాలను చూడడమే మానేసినట్లు ఒక ఇంటర్వ్యూలో వెల్లడించి ఆశ్చర్యపరిచాడు లాలెట్టన్. ఇందుకు ఆయన చెప్పిన కారణం.. అభిమానులను ఉద్వేగానికి గురి చేసింది.కొంత కాలం కిందట మోహన్ లాల్ తన బ్లాక్ బస్టర్ మూవీ చంద్రలేఖ సినిమా చూశాడట. తెలుగులో నాగార్జున హీరోగా అదే పేరుతో వచ్చిన సినిమాకు మాతృకనే ఈ చిత్రం. మోహన్ లాల్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రియదర్శన్ ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఐతే ఈ చిత్రంలో హాస్పిటల్ నేపథ్యంలో వచ్చే ఒక కీలకమైన సన్నివేశం చూసి మోహన్ లాల్ చాలా బాధ పడ్డాడట. ఆ సన్నివేశంలో తనతో పాటు నటించిన ఆర్టిస్టుల్లో ఎవ్వరూ ఇప్పుడు జీవించి లేరని.. అందరూ చనిపోయారని.. ఈ విషయం తెలిసి తనకు చాలా బాధేసిందని మోహన్ లాల్ చెప్పాడు.ఆయా నటులతో తనకు ఎన్నో మంచి జ్ఞాపకాలు ఉన్నాయని.. అలాంటి నటులు ఇప్పుడు లేరు అని తలుచుకుంటే బాధేస్తుందని.. అందుకే అప్పట్నుంచి తాను తన పాత చిత్రాలను చూడడం మానేసినట్లు మోహన్ లాల్ తెలిపాడు. ఈ కామెంట్స్ మోహన్ లాల్ అభిమానులను కూడా ఉద్వేగానికి గురి చేస్తున్నాయి. ఈ ఏడాది ఎంపురాన్, తుడరుమ్ చిత్రాలతో రికార్డ్ బ్రేకింగ్ హిట్లు కొట్టాడు మోహన్ లాల్. ఇంతలోనే ఆయన్నుంచి మరో కొత్త సినిమా రాబోతోంది. అదే.. హృదయపూర్వం. మాళవిక మోహనన్ ఇందులో కీలక పాత్ర పోషించింది. సత్యం అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓనమ్ కానుకగా ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం మీద మంచి అంచనాలే ఉన్నాయి.



# హక్కుల కోసం ఓటీటీల పోటీ

కొవిడ్ టైంలో థియేటర్లు మూతపడి ప్రేక్షకులు ఇళ్లకు పరిమితమైన సమయంలో ఓటీటీ సంస్థలు విజృంభించాయి. ఫ్యాన్సీ రేట్లు ఇచ్చి సినిమాలను కొని నేరుగా రిలీజ్ చేశాయి. అంతే కాక థియేటర్లలో వచ్చిన సినిమాలను కూడా త్వరగా డిజిటల్ రిలీజ్ చేయడం ద్వారా ఆదరణ పెంచుకున్నాయి. రెండు మూడేళ్ల పాటు ఓటీటీలన్నీ సినిమాలకు మంచి మంచి రేట్లు ఇచ్చేవి. క్రేజున్న సినిమాల డిజిటల్ హక్కుల కోసం వాటి మధ్య పోటీ ఉండేది. ఓ మోస్తరు సినిమాలన్నింటికీ ఈజీగా డిజిటల్ హక్కులు అమ్ముడయ్యేవి. కానీ గత రెండేళ్లలో కథ మారిపోయింది. ఓటీటీలు రేట్లు తగ్గించేశాయి. కొనే సినిమాల సంఖ్యనూ తగ్గించుకున్నాయి. ఇప్పుడు నిర్మాతలు డిమాండ్ చేసే స్థితిలో లేరు. డిజిటల్ హక్కుల అమ్మకం కోసం వాళ్లే వెంటపడే పరిస్థితి ఉంది. కోరుకున్న రేట్లూ దక్కడం లేదు. ఇలాంటి టైంలో ఓ సినిమా మాత్రం ఓటీటీ సంస్థలే తమ వెంట పడేలా, ఫ్యాన్సీ రేట్లు ఆఫర్ చేసేలా చేస్తోంది. ఆ చిత్రమే.. మహావతార నరసింహ. కన్నడలో తెరకెక్కిన ఈ యానిమేటెడ్ మూవీ గత నెల రోజులుగా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ప్రభంజనం సాగిస్తోందో తెలిసిందే. పెద్దగా అంచనాల్లేకుండా విడుదలై కన్నడతో పాటు తెలుగు, హిందీలో సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. ఆ సినిమా కలెక్షన్లు రూ.300 కోట్లకు చేరువగా ఉన్నాయి.విడుదలై నాలుగు వారాలు దాటినా ఆ సినిమా జోరు తగ్గడం లేదు. ఈ వీకెండ్లో కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ఐతే ఈ చిత్రానికి విడుదలకు ముందు డిజిటల్ హక్కుల అమ్మకం జరగలేదు. నిర్మాతలే అమ్మలేదా.. ఓటీటీల నుంచి ఆఫర్లు లేవా అన్నది తెలియదు. డిజిటల్ హక్కులు అమ్మకుండానే సినిమాను థియేటర్లలోకి తీసుకొచ్చారు. ఇప్పుడేమో సినిమా ఇరగాడేసింది. థియేటర్లలో ఈ సినిమాను చూసేవాళు బాగానే చూస్తున్నారు. ఓటీటీలోకి వస్తే చూద్దామని ఎదురు చూస్తున్న వాళ్లూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఫ్యామిలీస్, పిల్లలకు నచ్చే సినిమా కావడంతో ఓటీటీలోకి వచ్చాక మంచి డిమాండ్ ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ఈ సినిమా హక్కుల కోసం భారీ డిమాండ్ నెలకొంది. ఓటీటీలు ఫ్యాన్సీ రేట్లు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. భారీ చిత్రాలతో సమానంగా మహావతార నరసింహ డిజిటల్ రైట్స్ అమ్ముడయ్యే అవకాశముంది.

# ప్రభాస్ నిర్మాతల పోటాపోటీ



ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్‌గా అవతరించినప్పటికీ.. యువ కథానాయకులతో పోటాపోటీగా వేగంగా సినిమాలు చేస్తున్నాడు ప్రభాస్. బాహుబలి తర్వాత కొంచెం నెమ్మదిగా అడుగులు వేసినప్పటికీ.. గత కొన్నేళ్లలో బాగా వేగం పెంచాడు. 2023 చివర్లో సలార్ మూవీతో పలకరించిన ప్రభాస్..ఇంకో ఏడు నెలలకే కల్కి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కొంచెం ప్లానింగ్ సరిగ్గా ఉంటే ఈపాటికి రాజాసాబ్ కూడా రిలీజైపోయేది. ఆ చిత్రం వచ్చే సంక్రాంతికి వచ్చేలా కనిపిస్తోంది. రాజాసాబ్‌కు సంబంధించి కొంత చిత్రీకరణ మిగిలి ఉంది. ఈ సినిమాలో నటిస్తూనే సమాంతరంగా హను రాఘవపూడి సినిమాలోనూ నటిస్తున్నాడు ప్రభాస్. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఆ సినిమా కూడా సగం దాకా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కోసం ఇంకో మూడు సినిమాల మేకర్స్ ఎదురు చూస్తున్నారు. ఐతే వాటిలో సలార్-2 మొదలు కావడానికి టైం పట్టేలా ఉంది. ఈ చిత్రాన్ని రూపొందించాల్సిన ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో డ్రాగన్ తీస్తున్నాడు. కాబట్టి ఇంకో ఏడాది వరకు ఆ సినిమా ఊసేమీ ఉండదు. ఐతే ప్రభాస్ చేయాల్సిన మిగతా రెండు చిత్రాల మేకర్స్ తన కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. సందీప్ రెడ్డి వంగ స్పిరిట్ మూవీని సెప్టెంబరు చివర్లో మొదలుపెడతానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రకటించాడు. ఐతే కల్కి-2 మేకర్స్ కూడా వీలైనంత త్వరగా సినిమాను మొదలుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ సినిమాకు స్క్రిప్టు, ప్రి ప్రొడక్షన్ దాదాపుగా పూర్తయింది. ప్రభాస్ ఎప్పుడంటే అప్పుడు ఆ చిత్రాన్ని సెట్స్ మీదికి తీసుకెళ్లాలని అనుకుంటున్నారు. ఇది భారీగా విజువల్ ఎఫెక్ట్స్‌తో ముడిపడ్డ సినిమా. ప్రభాస్ సహకరిస్తూ అప్పుడప్పుడు కొన్ని కాల్ షీట్స్ ఇస్తే వాటిని సరిగ్గా వాడుకుని సినిమాను వేగంగా పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు. వేరే సినిమాలు పూర్తయ్యే వరకు ఎదురు చూడాలని అశ్వినీదత్, నాగ్ అశ్విన్ భావించట్లేదు. ఇక సందీప్ రెడ్డి మాత్రం బల్క్ డేట్స్ అడుగుతున్నాడు.

# హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్



'ఈటీవీ విన్'లో విడుదలైన 'కానిస్టేబుల్ కనకం, ఆల్ ఇండియా ర్యాంకర్స్, అనగనగా' చిత్రాలు అద్భుతమైన విజయంతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్ అందుకున్నాయి. ప్రతి చిత్రం రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాప్ ట్రెండింగ్‌లో స్ట్రీమ్ అవుతున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ తెలుగు వినోదోత్సవం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటీవీ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ మాట్లాడుతూ, 'హ్యాట్రిక్ సక్సెస్ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈనెల 29 ప్రపంచ తెలుగు దినోత్సవం. దీన్ని ఎవరు జరుపుకోవడం లేదు. ఈటీవీ విన్ సైడ్ నుంచి మేము దీనికి శ్రీకారం చుడుతున్నాం. ఇది తెలుగు వినోదోత్సవం. ఈనెల 23 నుంచి 29 వరకు ఈటీవీ విన్ కేవలం 29 రూపాయలకే సబ్స్క్రిప్షన్ చేసుకోండి. 'కానిస్టేబుల్ కనకం, ఆల్ ఇండియా ర్యాంకర్స్, అనగనగా' ఈ సినిమాల విజయాల క్రెడిట్ దర్శక, రచయితలకు, నటీనటులకు, ఈ విన్ టీంకు దక్కుతుంది' అని తెలిపారు. 'ఈ మూడు సక్సెస్‌మీట్‌లు కలుపుకొని ఒక వేడుకగా చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈటీవీ విన్‌లో మనందరికీ నచ్చే మన కథలు ఉంటాయి. అవి ఉన్నంతకాలం మనం ఇలా కలుస్తూనే ఉంటాం' అని ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి చెప్పారు. ఈ వేడుకలో నాయిక వర్ష బొల్లమ్మ, డైరెక్టర్ ప్రశాంత్, ప్రొడ్యూసర్ సాయిబాబా, రచయిత బివిఎస్ రవి, డైరెక్టర్ సందీప్ రాజ్, నటులు చైతన్యరావు, హర్ష, డైరెక్టర్ జోసఫ్, డైరెక్టర్ సన్నీ తదితరులు పాల్గొని తమ విజయానందాన్ని వ్యక్తం చేశారు.

# అద్భుతమైన మెలోడీగా 'ఇలా చూసుకుంటానే'



నీలి నీలి ఆకాశం క్రియే షన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్ మెంట్, ఎన్‌వీఎల్ క్రియే షన్స్ బ్యానర్స్‌పై మున్నా ధులిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్యాడ్ గాల్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ నిర్మాతలు. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే' అనే మెలోడీ పాటను ఆదివారం హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా విడుదల చేశారు. పాట విని, అద్భుతంగా ఉందంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ 'ఇది అద్భుత మైన మెలోడీ పాట. 'నీలి నీలి ఆకాశం' పాట సీక్వెల్‌గా, అంతకన్నా గొప్పగా ఉంటుంది. ఈ పాటను మొత్తం జమ్మూ కాశ్మీర్, మలేషియా ప్రకృతి అందాలలో చిత్రీకరించాం. అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీ అందిస్తే, సిద్ శ్రీరామ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. ఇక చంద్రబోస్ రాసిన సాహిత్యం అత్యద్భుతంగా ఉంది.

అద్భుతమైన మెలోడీ పాటగా అందర్నీ అలరిస్తోంది. ఇది పూర్తిగా వినోద భరిత చిత్రం. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు.

# ఒక్క రూపాయి కూడా తీసుకోని 'ఏజెంట్'



ఒకప్పుడు టాలీవుడ్లో బిజీ ప్రొడ్యూసర్లలో ఒకడిగా ఉండేవాడు అనిల్ సుంకర. రామ్ ఆచంట, గోపీనాథ్ ఆచంటలతో కలిసి '14 రీల్స్' బేనర్లో 'దూకుడు' సహా పలు భారీ చిత్రాలను నిర్మించిన ఆయన.. 'ఏకే ఎంటర్టైన్మెంట్స్' బేనర్లో విడిగా చిన్న, మిడ్ రేంజ్ సినిమాలనూ ప్రొడ్యూస్ చేశాడు. ఐతే కొన్నేళ్ల తర్వాత 14 రీల్స్ నుంచి బయటికి వచ్చి ఏకే బేనర్లోనే సినిమాలు తీస్తూ వచ్చాడు. ఆ సంస్థను పెద్ద స్థాయికి తీసుకెళ్లేలా కొన్ని క్రేజీ ప్రాజెక్టులను లైన్లో పెట్టాడు అనిల్. కానీ వాటిలో 'సరిలేరు నీకెవ్వరూ' చిత్రం బాగా ఆడినా.. ఆ తర్వాతి చిత్రాలు ఆయనకు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. అఖిల్ అక్కినేని మీద భారీ బడ్జెట్ పెట్టి తీసిన 'ఏజెంట్'.. మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. దీంతో అనిల్ ప్రొడక్షన్ హౌస్ సంక్షోభంలో పడింది. ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'భోళాశంకర్' తనను ఎంత పెద్ద దెబ్బ కొట్టిందో ఆయన పరోక్షంగా మాట్లాడాడు. దీంతో సోషల్ మీడియా జనాలు చిరంజీవి వైపు వేలెత్తి చూపించడం మొదలుపెట్టారు. చిరంజీవి వల్ల మంచి నిర్మాత దెబ్బ తిన్నాడంటూ కౌంటర్లు వేశారు. మరోవైపు చిరు అభిమానులు.. అనిల్ కామెంట్లకు హర్టయ్యారు. ఐతే ఒక ఇంటర్వ్యూలో అనిల్.. చిరు తనకు చేసిన సాయాన్ని గుర్తు చేసుకున్నారు. 'భోళా శంకర్' ఫెయిల్యూర్ తర్వాత చిరు తనకు ఎంతగానో అండగా నిలిచారని.. ఆ నష్టాల నుంచి బయటపడడానికి సాయం చేశారని అనిల్ తెలిపారు. ఇక 'ఏజెంట్' ఫలితం గురించి అనిల్ మాట్లాడారు. ఈ సినిమాకు అఖిల్ ఒక్క రూపాయి కూడా పారితోషకం తీసుకోలేదన్నాడు. సినిమా బాగా ఆడితే రెమ్యూనరేషన్ తీసుకునేవాడని.. అలా జరక్కపోవడంతో అతను ఒక్క రూపాయి కూడా పుచ్చుకోలేదని అనిల్ వెల్లడించాడు.

# అసంపూర్తి పనులతో విద్యార్థుల అవస్థలు

- ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రి పాలైతున్న విద్యార్థులు
- ఓయూ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నత్తి నడకన పనులు
- ఓయూ పరిధిలో భవనాల నిర్మాణానికి కోట్లలో ఖర్చు చేసిన నాణ్యతలేని పనులే
- ఓయూ అధికారుల అవినీతిపై ఏసీబీ దృష్టి సారించాలని విద్యార్థుల విన్నపం







**ఓయూ (ప్రశ్న న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అధికారుల నిర్వహణ అత్యవసరంగా మారింది. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కోట్లు కేటాయించిన నాణ్యతతో పనులు చేయకపోవడం ఒక భాగమైతే పనులను నిర్లక్ష్యం చేస్తూ సంవత్సరాలు పొడిగిస్తూ కాలక్షేపం చేస్తున్నానని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కోట్ల సొమ్ము దుర్వినియోగం జరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో శానిటేషన్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తుందని పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు, రిజిస్టర్, విసి స్పందించకపోవడంతో విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారింది. ఏ గ్రౌండ్ పరిధిలో కోట్లు ఖర్చుపెట్టి రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు అయితే దాని చుట్టూ వర్షం నీరు వెళ్లడానికి ఏర్పాటుచేసిన నాలా అసంపూర్తిగా ఉండడంతో అందులో విద్యార్థులు, ప్రజలు వాకింగ్ చేస్తూ జారి పడుతున్నారు ఇటీవల కాలంలో పలువురు జారి పడటంతో సెక్యూరిటీ సిబ్బంది అంబులెన్స్ పిలిపించి వారిని పంపించి వేశారు. గ్రౌండ్ల అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎక్కడపడితే అక్కడ మట్టిదిబ్బలు పెండింగ్ పనులు దర్శనమిస్తున్నాయని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకంగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు కోట్లు తెచ్చిపెట్టే ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులు అన్నట్లుగా ఇంజనీరింగ్ అధికారులు కూడా కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతూ నాసిరకం పనులను కూడా క్వాలిటీ కంట్రోల్ లో పాస్ చేస్తూ బిల్లులు అందిస్తున్నారని వాస్తవానికి ఓయూ పరిధిలో బిల్డింగ్ల నిర్మాణాలలో భారీగా అవకతవకలు జరిగాయని కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మాణ పనులు చేస్తున్న అధికారులు పట్టించుకోకుండా లంచాలకే పరిమితమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వ పనులు అంటే నాసిరకానికి పెట్టింది పేరుగా మారింది పరిస్థితి. అందుకోసమే 20 సంవత్సరాలు కాగానే ప్రభుత్వ భవనాలను పూర్తిగా తొలగించి మళ్లీ నిర్మాణాలు చేస్తున్నారు అంటే ఎంత నాణ్యత పాటిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అధికారులు పూర్తిగా లంచాలు తీసుకొని ఓయూ ను అస్తవ్యస్తంగా వ్యవస్థను మార్చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై వెంటనే వీసీ స్పందించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

# మార్వాడి దుకాణంలో ఎవరు సామాగ్రి కొనవద్దు: కుమ్మరి ఆంజనేయులు

- మార్వాడికు బగావ్.. తెలంగాణకు బచ్చావ్
- నాసిరకం వస్తువుల అమ్ముతూ కోట్లు గడిస్తున్నారు
- హార్డ్వేర్, స్వీట్ షాప్, బట్టల షాప్, కుండల షాప్ ఇలా అన్ని వృత్తులు కబ్జా చేశారు
- మన తెలంగాణ వృత్తి పై దెబ్బ కొడుతున్న మార్వాడీలను పంపించి వేయాలి
- మార్వాడీల నాసిరకం వస్తువులతో తీవ్రంగా నష్టపోతున్న తెలంగాణ ప్రజలు
- రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేస్తూ అద్దరించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతున్నారు



**తార్నాక(ప్రశ్న న్యూస్)** మార్వాడీలను తెలంగాణల నుండి పంపించి వేస్తేనే తెలంగాణకు భవిష్యత్తు ఉంటుందని కుమ్మరి ఆంజనేయులు పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు అధికారులు వీళ్ళు ఇచ్చే డబ్బులకు ఆశపడి వారిని ప్రోత్సహించి తెలంగాణకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని దానికి తోడు మార్వాడీలు అవినీతి అక్రమాలు చేస్తూ అక్రమ దందాలకు పాల్పడుతూ ఇస్తారాజ్యంగా రేట్లు పెంచి ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని కుమ్మరి ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణని బాగుపరచాలంటే మార్వాడికు బగావ్ తెలంగాణకు బచావో అన్న నినాదంతో యావత్ తెలంగాణ పోరాడాలని మార్వాడి దుకాణాలలో ఎలాంటి సామాగ్రి కొనవద్దని ఈ సందర్భంగా కోరారు.ప్రతి తెలంగాణ వాది మార్వాడి గో బ్యాక్ అంటూ ముందుకు రావాలని కోరారు. వీళ్ల దౌర్జన్యానికి మొన్న మోండా మార్కెట్ లో రోడ్డుపై పార్కింగ్ విషయంలో ఎస్.కె జూలరి యజమాని, అతని అనుచరులు సాయికుమార్ పై దాడి చేశారని తర్వాత వాళ్ళ అస్తిత్వానికి నష్టం వస్తుందని అతనికి డబ్బులు ఇచ్చి ప్రెస్ మీట్ ఏర్పరచాలని ఆరోపించారు. చివరికి కుమ్మరి వాళ్ళ కుండలు అమ్ముకునే వ్యాపారం పై కూడా మార్వాడీలు దెబ్బతీసారని రోడ్లపై కుండలు అమ్ముతూ కుమ్మరిలను రోడ్డుపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్వాడీలు ఏ వ్యాపారంలో ఉన్న అవి పూర్తిగా నాసిరకంగా ఉంటాయని ప్రతి వ్యాపారంలో నాసిరకం వస్తువులు తీసుకువచ్చి ప్రజల జీవితాన్ని అష్టవ్యస్తం చేస్తున్నారని వీళ్ళపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి తెలంగాణ ప్రజలను దోపిడి నుండి కాపాడాలని కోరారు. బేగంబజార్లో పూర్తిగా మార్వాడి చేతుల్లో ఉందని అందుకోసమే బేగం బజార్ అవినీతికి అడ్డగా మారిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే మార్వాడీల వ్యాపారాలపై దాడులు చేసి నాసిరకం చేస్తున్న వాళ్లపై చట్టపరమైన కేసులు పెట్టాలని అదేవిధంగా తెలంగాణ ప్రజలు మార్వాడీల దుకాణంలో ఎలాంటి వస్తువులు కొనవద్దని పిలిపించారు.

# మీనాక్షి నటరాజన్ తో కలసి శ్రమదానంలో భాగస్వామ్యులైన కొట్టెపల్లి సుధాకర్



**గంగాధర / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం ఉదయం గంగాధర గురుకుల పాఠశాలలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రమదానంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమంలో ఆమె స్వయంగా శ్రమదానం చేయడం ఆకర్షణీయంగా మారింది. కార్యక్రమంలో బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ కూడా పాల్గొని శ్రమదానం చేశారు.వారి వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,బోయినిపల్లి మాజీ ఎంపిటిసి సంబ లక్ష్మీరాజం,నాయకులు ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పాఠశాల శుభ్రతలో భాగస్వామ్యం అయ్యారు.

## మండలంలో పండుగల భద్రతా ఏర్పాట్లపై
# అధికారుల సమీక్షా సమావేశం

- మత సామరస్యంతో వినాయక చవితి,మిలాద్ ఉన్-నబి పండుగల నిర్వహణకు చర్యలు




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాల్లో వినాయక చవితి,మిలాద్ ఉన్-నబి పండుగలను శాంతియుతంగా, మత సామరస్యంతో నిర్వహించేందుకు మండల స్థాయిలో అధికారుల సమీక్షా సమావేశాన్ని ఎంపీడీఓ భీమా జయశీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్,రెవెన్యూ శాఖ,పోలీసు శాఖ,విద్యుత్ శాఖల అధికారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పండుగల సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ప్రజా శాంతి భద్రత,విద్యుత్ సరఫరా,రహదారి పరిశుభ్రత, శానిటేషన్ వంటి అంశాలపై సమన్వయం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో మండల నాయబ్ తహసీల్దార్ ఎన్. భూపేష్, హెడ్ కానిస్టేబుల్ పి. ప్రకాష్,సంబంధిత వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమాజానికి జైన్ సమాజ్ చేస్తున్న సేవలు
# అభినందనీయం: ఎమ్మెల్యే శ్రీ గణేష్

- ఎమ్మెల్యే శ్రీ గణేష్,జంపన ను సన్మానించిన జైన్ సమాజ్ ప్రతినిధులు



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** శ్రీ జైన్ స్వేతాంబర్ తేరాపంత్ సభ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో బోయిన్ పల్లి రాజరాజేశ్వరీ గార్డెన్స్ లో 8 రోజల ఉపవాస దీక్ష, శాంతిసందేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ లు ముఖ్య అతిధులుగా హాజరై జైన్ సాధ్వీల ఆశీర్వాదం తీసుకున్నారు..ఈ కార్యక్రమంలో సాధ్వి డాక్టర్ గవేష్ణ శ్రీజి, మేరు ప్రభజి,మయాంక్ ప్రభ,దక్షి ప్రభ, హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ బంటీయా,సంకి రవీందర్, ప్రభుగౌడ్, పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెరపంతి సభ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ ధరకు స్థలం కేటాయిస్తే తెరపంత్ భవనం నిర్మిస్తామని శ్రీ గణేష్ ను కోరారు.శ్రీ గణేష్ సానుకూలంగా స్పందించారు.సమాజ్ అధ్యక్షులు సుశీల్ సంచేటి, హేమంత్ సంచేటి, ముకేశ్ చౌరసియా, బాబూలాల్ బేధ, పాల్గొన్నారు.

# జయరాం వ్యాయామశాలలో జంపన పూజలు



**బోయిన్ పల్లి(ప్రశ్న న్యూస్)** మహంకాళి అమ్మవారి బోనాల జాతర అనంతరం వ్యాయమ శాలలో పూజలు చేయడం వల్ల ప్రతికూల శక్తులు తగ్గించి జీవితంలో విజయం కలుగు తుందని కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. న్యూ బోయిన పల్లి లోని జయరాం వ్యాయామశాల లో నిర్వహించిన పూజల లో ముఖ్య అతిధిగా జంపన ప్రతాప్ పాల్గొని పూజలు చేసారు. అనంతరం జంపన మాట్లాడుతూ.. ఆషాడ శ్రావణ బోనాల జాతర పూర్తి అయినా తరవాత అమావాస్య మరుసటి రోజు పూజలు చేయడం ఆనవాయితీ అని అన్నారు. ఈ కార్యక్రమం లో బి. రాజేందర్, సాయి పోతరాజ్, గిరి గౌడ్, దామోదర్ గౌడ్, సత్యం గౌడ్,సదా నంద్, భరత్, మారుతి గౌడ్, సందీప్ రెడ్డి, సన్నీ, దిలీప్ పాల్గొన్నారు.

# మీనాక్షి నటరాజన్‌ను సన్మానించిన పట్టణ కాంగ్రెస్ నేతలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గం,గంగాధర మండలంలో జనహిత పాదయాత్ర సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి,వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.మీనాక్షి నటరాజన్ ను కలిసిన వారిలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు పులి రాంబాబు,ఏఎంసీ డైరెక్టర్ దైత కుమార్,మోటూరి శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల
# కల్పనకు ప్రాధాన్యతనివ్వండి-మంత్రి నారాయణ

- టిడిఆర్ బాండ్లు అర్హులైన వారికి ఇస్తున్నాం
- గ్రామాలనుంచి వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలి
- శెట్టిపల్లి భూముల సమస్య త్వరలో పరిస్కారం
- ఆదాయం పెంపుదలకు కొత్త లే అవుట్స్ ఏర్పాటు
- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**తిరుపతి(ప్రశ్న న్యూస్)** ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు.సోమవారం ఉదయం తుడా కార్యాలయంలో నగరపాలక సంస్థ ,తుడా అధికారులతో అభివృద్ధి పనులు, ప్రజలకు కల్పించాల్సిన వసతులపై మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. తుడా టవర్స్ , ప్లాట్స్ , దుకాణాల పై వచ్చే అదాయ, వ్యయాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వి.సి., జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థ లో పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్.మౌర్య వివరించారు. టౌన్ షిప్ లను అభివృద్ధి చేసి తుడా ఆదాయాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. తుడా ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే నివేదికలను ఇవ్వకుండా వాస్తవాలను వివరించి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతిలో కూడా రోడ్ల శుభ్రతకు స్వీపింగ్ మిషన్ లను వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణా రెడ్డి, శ్యాంసుందర్, ఈ.ఈ.లు రవీంద్ర, తులసి కుమార్, గోమతి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం

## పర్యావరణాన్ని కాపాడుకుందాం



- విషతుల్యమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి ప్రమాదకరం
- పర్యావరణం కలిషితమవడం జంతు జీవరాసులకు జీవన్మరణ సమస్యగా మారింది
- మట్టి విగ్రహాలను పూజించడంపై ప్రజలకు అవగాహ కల్పించాలి
- పండగ సంప్రదాయలు పాటిస్తునే సామాజిక భాధ్యతపై దృష్టి సారించాలి


**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతి పండగ వెనక ఓ మహోన్నత లక్ష్యం కనిపిస్తుంది. ప్రకృతిలో మమేకమవుతు నేలా-నీరు, చెట్టు-పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటిని ఆరాధించడం మన సంస్కృతిలో భాగంగా అనాధిగా వస్తున్న వారసత్వ ఆచారం. నిజానికి ఇదే మన భారతీయ సంస్కృతి గొప్పదనం. దేశమంతా వినాయక చవిత ఉత్సవాలకు సిద్ధమవుచున్న సమయంలో పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక భాధ్యతను కూడా పరిగణలోకి తీసుకోవల్సిన తరుణమిది. కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే కొత్త ఒవరడిని ప్రక్కనపెట్టి, పర్యావరణహిత గణపతులకు ప్రాధాన్యమివ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ రకాల రసాయనాల మిళితమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలతో తీవ్రమైన కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ప్రమాధంగా మారింది. దీంతో పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించి మట్టి గణపతిని పూజించడం కోసం గట్టి సంకల్పం తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది. గొప్పలకు పోయి మనకు మనమే నష్టం చేసుకునేకంటే ఉన్నంతలో పండగ చేసుకొని పది మందికి మంచిని పంచిపెట్టడంతో భగవంతుని కరుణకటాక్షాలు పొంది ఎంతో మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత చర్చలు జరుగుచున్న తరుణంలో వినాయక చవితి సందర్భంగా విషపూరితమైన రసాయణల మిలితమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన రంగు రంగుల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలుచేసి మంచినీటి వనరులలో నిమజ్జనం చేయడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆనందమైన సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది. మనం చేసే కార్యక్రమాల వల్ల ఎదుటి వారికి ఏలాంటి నష్టం, కష్టం రాకూడదనేదే మన పండగల పరమార్థం. మనుషులు, మూగ జీవాలకు ఎలాంటి నష్టం చేకూరకుండా చేతనైనంత సాయం చేయాలి, కాని పర్యావరణన్ని కలిషితం చేసి ఇబ్బందులను సృష్టించడం దుర్మార్గమైన చర్య. మట్టి గణపతులను పూజించడంతోనే సరిపోదు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషిచేయాలి. మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తీవ్ర కృషి చేస్తున్నాయి. దీన్ని ఒక ఉద్యమంల ఉరుకులు పెట్టించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఎలాంటి మంచి పనికైన మొదట్లో కొన్ని ఇబ్బందులు తప్పవు. ఆచరిస్తే పెద్ద కష్టమైంది ఏమి కాదు. భూమిని చీల్చుకొని పుట్టే మొలక పచ్చని బ్రహ్మ వృక్షంలా ఎదిగినట్టు విగ్నాధిపతి అయిన గణనాథుని పండగ అయిన వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలనే మొగ్గ తొడిగిన ఆలోచన ఉన్నత ఆశయాల దిశగా ఎదిగేట్టు ముందడుగు వేయాలని ఆశిదాం.

# గుడి స్థలం కబ్జా

## అధికారుల చర్యలు శూన్యం

- నాగారం రామకృష్ణ కాలనీలో
- గుడి స్థలం కబ్జా చేసిన భూకబ్జాదారులపై చర్యలు శూన్యం
- భూ కబ్జాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోని కమిషనర్ భాస్కర్ రెడ్డి
- దేవుడు స్థలాన్ని వదల కుండా కబ్జాలకు పలుపడుతున్న కబ్జా రాయుళ్లు





**నాగారం( ప్రశ్న న్యూస్)** కబ్జా రాయుళ్లకు హద్దు అదుపు లేకుండా పోయింది. అధికారుల అవినీతి వీళ్లకు కలిసిరావడంతో గుడి బడి తేడా లేకుండా ఎక్కడ కాలి స్థలం అనిపిస్తే అక్కడ కబ్జా చేస్తున్నారు. దానిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు వాళ్లతో చేతులు కలిపి లంచాలు తీసుకొని స్థలాల కబ్జాలపై అసలు స్పందించడమే మరిచిపోయారు. నాగారం మున్సిపల్ పరిధిలోని రామకృష్ణ కాలనీలో గుడి స్థలం కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు ఇచ్చిన కమిషనర్ భాస్కర్ రెడ్డి పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నాగారం మున్సిపల్ పరిధిలోని రామకృష్ణ కాలనీలో గుడి స్థలం కబ్జా అవుతుందని హైడ్రా కు, మున్సిపల్ కమిషనర్ కు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసుల ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగారం మున్సిపల్ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు కమిషనర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద నినాదాలు చేశారు. కబ్జారాయులతో కమిషనర్ చేతులు కలిపి ఫిర్యాదులపై స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమస్యపై మాట్లాడుటకు మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ పాల్గొని మున్సిపల్ అధికారులను చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కాలనీవాసులు మున్సిపల్ అధికారులపై తీవ్రమైన ఆగ్రహంతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్ శాఖలో ఉన్నత అధికారులు పూర్తి బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడం వల్లనే కమిషనర్లు కిందిస్థాయి సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక నాగారం మున్సిపల్ అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఇప్పటికైనా దృష్టి పెట్టి గుడి స్థలం కాపాడాలని లేనట్లయితే మంత్రులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ సిబ్బంది కబ్జారాయుళ్లకు పూర్తిగా సహకరిస్తున్నారని ఇందులో భారీగా అవినీతి చోటుచేసుకుందని లక్షలలో సొమ్ము చేతులు మారినట్లు స్థానికులు ఆరోపించినారు. కమిషనర్ అక్రమాలకు కొమ్ముకాస్తూ కోర్టు గడిస్తున్నాడని ఇతనిపై ఏసీబీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉన్నత అధికారులు మొద్దు నిద్రలో ఉండడం వల్ల ఇంత అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అమెరికా ప్రణాళికలను తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలన్న అయతొల్లా ఖమేనీ



ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరోసారి అమెరికా, ఇజ్రాయెల్‌లపై తీవ్రంగా మండిపడ్డారు. తమను లొంగదీసుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించిన అయతొల్లా, దీనికి వ్యతిరేకంగా భాగస్వామ్య దేశాలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు."ఏ పరిస్థితిలోనూ అమెరికాకు తలొగ్గేది లేదు" అని ఖమేనీ స్పష్టం చేశారు. తన అధికారిక వెబ్‌సైట్ ద్వారా చేసిన ప్రకటనలో, జూన్‌లో తమ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికాలు దాడి చేయడం తమను ప్రతీకార చర్యల వైపు నెట్టిందని పేర్కొన్నారు.తెహ్రాన్‌ను అస్థిరపరచాలనే లక్ష్యంతోనే అమెరికా ప్రణాళిక రూపొందించిందని ఆరోపించిన ఆయన, ఇజ్రాయెల్ దాడి చేసిన మరుసటి రోజే అమెరికా ఏజెంట్లు యూరప్‌లో సమావేశమయ్యారని, ఇరాన్ పాలనపై చర్చించినట్టు తెలిపారు. అంతిమంగా అమెరికా ఆశయం ఇరాన్‌ను విధేయ దేశంగా మార్చడమేనని విమర్శించారు.అంతర్గతంగా దేశం ఐక్యంగా నిలబడిందని, సైన్యం, ప్రభుత్వం, ప్రజలు అందరూ కలిసి శత్రువులకు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు. ఇరాన్ చూపిన ధైర్యాన్ని ప్రపంచం మొత్తం చూసిందని, అనేక దేశాలకు ఇరాన్ పట్ల గౌరవం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అంతర్గత విభేదాలను విదేశీ శక్తులు ఉపయోగించుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.కాగా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలతో ఇరాన్ మంగళవారం అణు చర్చల కోసం సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఖమేనీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## బల్గేరియా బాటలోనే మరో యూరప్ దేశం

# భారతీయులకు ఆఫర్

- యూరప్‌లో నివాసం కోసం భారతీయులను ఆకర్షిస్తున్న గ్రీస్ గోల్డెన్ వీసా పథకం
- ప్రధాన నగరాల్లో 8 లక్షల యూరోలకు (దాదాపు రూ.7 కోట్లు) పెరిగిన కనీస పెట్టుబడి
- ఒక్క వీసాతో 29 షెంజెన్ దేశాల్లో వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యం
- వీసా పొందిన వారి కుటుంబ సభ్యులకు కూడా వర్తించే నివాస హక్కు
- ఏడేళ్ల తర్వాత గ్రీక్ పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే అద్భుత అవకాశం
- గత ఏడాది గ్రీస్ ఆస్తుల కొనుగోళ్లలో భారతీయుల పెట్టుబడుల్లో భారీ పెరుగుదల



యూరప్‌లో స్థిరపడాలని, అక్కడి దేశాల్లో స్వేచ్ఛగా ప్రయాణించాలని ఆశించే సంపన్నులకు ఇటీవలే బల్గేరియా దేశం బంపర్ ఆఫర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే బాటలో గ్రీస్ దేశం ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. యూరప్‌లోని అందమైన దేశం గ్రీస్‌లో నివసించాలని, వ్యాపారం చేయాలని కలలు కనే భారతీయులకు ఇది ఒక అద్భుతమైన అవకాశం అనే చెప్పాలి. గ్రీస్ ప్రభుత్వం అందిస్తున్న "గోల్డెన్ వీసా" కార్యక్రమం ద్వారా పెట్టుబడి పెట్టి, ఆ దేశంలో దీర్ఘకాలిక నివాస హక్కులను పొందవచ్చు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు భారతీయులకు కూడా అనుమతి ఉంది.

2013లో ప్రారంభమైన ఈ గోల్డెన్ వీసా అనేది పెట్టుబడి ద్వారా నివాసాన్ని పొందే కార్యక్రమం. ఐరోపా సమాఖ్య (EU) వెలుపలి దేశాల పౌరులు గ్రీస్‌లో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఐదేళ్ల కాలపరిమితితో కూడిన రెసిడెన్స్ పర్మిట్‌ను పొందవచ్చు. ఈ పర్మిట్‌ను ప్రతి ఐదేళ్లకోసారి పునరుద్ధరించుకునే సౌలభ్యం కూడా ఉంది. ఈ వీసా పొందిన వారు తమ కుటుంబ సభ్యులతో (భార్య/భర్త, 21 ఏళ్లలోపు పిల్లలు) కలిసి గ్రీస్‌లో నివసించవచ్చు, చదువుకోవచ్చు, సొంతంగా వ్యాపారం కూడా చేసుకోవచ్చు.

### ప్రధాన ప్రయోజనాలు

ఈ వీసా ద్వారా గ్రీస్‌లోనే కాకుండా, ఇతర షెంజెన్ దేశాల్లోనూ 180 రోజుల వ్యవధిలో 90 రోజుల వరకు వీసా లేకుండా స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు. వీసాను కొనసాగించడానికి గ్రీస్‌లో తప్పనిసరిగా నివసించాలన్న నిబంధన లేకపోవడం భారతీయులకు ఒక ముఖ్యమైన ప్రయోజనం. దీనివల్ల వారు తమ ప్రధాన నివాసాన్ని ఇండియాలోనే కొనసాగిస్తూ, ఐరోపాలో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అంతేకాకుండా, వీసాదారులు గ్రీక్ పౌరుల మాదిరిగానే ప్రభుత్వ విద్య, వైద్య సేవలను పొందేందుకు అర్హులు. ఏడేళ్ల పాటు గ్రీస్‌లో నివసించిన తర్వాత గ్రీక్ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే మార్గం కూడా సుగమం అవుతుంది.

### పెట్టుబడి మార్గాలు

గోల్డెన్ వీసా కోసం పలు పెట్టుబడి మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

- రియల్ ఎస్టేట్ రంగంలో కనీసం 250,000 యూరోలు (సుమారు రూ. 2.56 కోట్లు) పెట్టుబడి పెట్టవచ్చు. ఏథెన్స్, శాంటోరిని వంటి అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఈ పరిమితి 500,000 యూరోలుగా ఉంది.
- గ్రీక్ కంపెనీలో కనీసం 500,000 యూరోల మూలధన సహకారం అందించవచ్చు లేదా అక్కడి బ్యాంకులో అంతే మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు.
- గ్రీక్ ప్రభుత్వ బాండ్లలో 500,000 యూరోలు లేదా అక్కడి స్టాక్ మార్కెట్లలో ట్రేడ్ అయ్యే షేర్లు, కార్పొరేట్ బాండ్లలో 800,000 యూరోలు పెట్టుబడిగా పెట్టవచ్చు.
- కొత్తగా ప్రతిపాదించిన నిబంధన ప్రకారం గ్రీక్ స్టార్టప్‌లలో కనీసం 250,000 యూరోల పెట్టుబడితో కూడా ఈ వీసాకు అర్హత సాధించవచ్చు.

### దరఖాస్తు ప్రక్రియ

ముందుగా అర్హత ఉన్న పెట్టుబడి మార్గాన్ని ఎంచుకుని, లావాదేవీని పూర్తి చేయాలి. అనంతరం అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని, దరఖాస్తును ఇమ్మిగ్రేషన్ విభాగానికి సమర్పించాలి. ప్రధాన దరఖాస్తుదారునికి 2000 యూరోలు, కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 150 యూరోల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ వివరాలు అందించిన తర్వాత దరఖాస్తు ఆమోదానికి సాధారణంగా 6 నుంచి 12 నెలల సమయం పడుతుంది. ఆమోదం లభించిన వెంటనే రెసిడెన్స్ పర్మిట్ జారీ చేయబడుతుంది.

## అనిల్ అంబానీకి

# బిగుస్తోన్న ఉచ్చు



బ్యాంక్ రుణ మోసం కేసులో రిలయన్స్ గ్రూపు ఛైర్మెన్ అనిల్ అంబానీకి ఉచ్చు బిగుస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన కేసులో ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ప్రారంభించగా.. తాజాగా సీబీఐ కూడా సోదాలు చేసింది. బ్యాంక్ ఫ్రాడ్ కేసులో అనిల్ అంబానీకి సంబంధించిన కంపెనీలు, ఇతర ప్రాంతాల్లో సీబీఐ శనివారం సోదాలు చేపట్టింది. అనిల్ గ్రూప్ కంపెనీలు పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అవకతవకలకు పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. దాంతో ఇప్పటికే ఆయన కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండు వారాల క్రితం ఆయనను 10 గంటల పాటు ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)కి రూ.2వేల కోట్ల మేర మోసం కేసులో తాజాగా సీబీఐ సోదాలు నిర్వహించింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్బీఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను మోసపూరితమైందని గుర్తించిన తర్వాత ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్బీఐకి తెలపాలి. కేసును సీబీఐ, పోలీసులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఇక ఈడీ ప్రాథమిక నివేదిక ప్రకారం.. 2017 నుంచి 2019 మధ్య కాలంలో యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాలను అనిల్ అంబానీ కంపెనీలు అనుమానాస్పద రీతిలో దారి మళ్లించాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమో టర్లకు లంచం ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ అంశంలో యెస్ బ్యాంక్ మాజీ ఎండీ ప్రమోటర్ రాణా కపూర్‌పై దాఖలైన మనీలాండరింగ్ కేసులో భాగంగా 2020లో అనిల్ అంబానీ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. అదేతరహాలో మరో రూ.14వేల కోట్లు ఇతర బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్టు అధికారులు వెల్లడించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588